ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

RNI : TELTEL/2021/80267

సంపుటి: 6 సంచిక: 64, పేజీలు - 08

సోమవారం, ఆగష్టు 31, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## 'డ్రగ్స్ ఫ్రీ వికసిత భారత్' కోసం

# ప్రచారం చేయండి

### - యువతకు ప్రధాని మోదీ సూచన



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** మత్తుపదార్థాలపై పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నాడు దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మన్ కీ బాత్ 137వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ మత్తుపదార్థాలపై వినూత్నంగా పోరాటాన్ని కొనసాగించాలని, సరికొత్త మార్గాల్లో యువతను ఈ వ్యసనం బారిన పడకుండా చేయాలన్నారు. 'నశా ముక్త యువ ఫర్ వికసిత భారత్' (డ్రగ్స్ లేని భారత్) కోసం ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, భారీ సంఖ్యలో యువత ఇందులో భాగస్వాములు అవుతున్నారని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రచార లక్ష్యం స్పష్టంగా ఉందని ప్రధాని మోదీ చెప్పారు. దేశ యువతను మత్తుపదార్థాలకు దూరంగా ఉంచడం, భారత్‌ను డ్రగ్స్ రహితంగా మార్చడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని అన్నారు. మత్తు అలవాటు ఒక్క వ్యక్తినే ప్రభావితం చేయదని, దాని ప్రభావం మొత్తం కుటుంబంతో పాటు సమాజంపై పడుతుందని చెప్పారు.

#### కొత్త ఆలోచనలు, ప్రయత్నాలకు వేదిక మన్ కీ బాత్

'మన్ కీ బాత్' అనేది దేశ ప్రజల కొత్త, విభిన్న ఆలోచనలపై చర్చ జరిగే వేదిక అని ప్రధాని మోదీ అన్నారు. ఈ ఆలోచనల వెనుక ప్రజల దీర్ఘకాల శ్రమ, పూర్తి నిబద్ధత ఉంటాయని పేర్కొన్నారు. కనుక అలాంటి ప్రయత్నాలను దేశం ముందు తీసుకురావడం, వాటి ద్వారా ఇతరులను ప్రేరేపించడం 'మన్ కీ బాత్'లో ముఖ్యమైన అంశమని

2లో..

## మంత్రివర్గ విస్తరణకు

# ముహూర్తం ఫిక్స్

### - అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేలోపే మంత్రి మండలి విస్తరణ, ప్రక్షాళనకు సీఎం సిద్ధమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా రేవంత్ రెడ్డి తన జట్టులో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలను ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం.

రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో కొనసాగుతున్న జాప్యం, సీడబ్ల్యూసీ సమావేశం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా సీఎం కసరత్తు చేస్తుండడం లాంటి తాజా రాజకీయ పరిణామాలను చూస్తే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన

2లో..

## మూడు దశాబ్దాల

# నిరీక్షణకు ముగింపు

### - సాకారమవుతున్న వెలిగొండ స్వప్నం!



**అమరావతి (ప్రశ్న న్యూస్)** దశాబ్దాల కల నెరవేరుతోంది. కరవు నేలపై జల సిరులుపొంగిపొర్లే సమయం వచ్చేసింది. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఆగస్ట్ 31వ తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరగనుంది. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలంలోని గంటవానిపల్లె సమీపంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు ను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి

2లో..

## డ్రాలో పేరు వస్తే ఇల్లు సొంతమైనట్లు కాదు

### - ఇందిరమ్మ ఇళ్ల డ్రాపై కీలక ప్రకటన




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు హౌసింగ్ బోర్డు స్పష్టం చేసింది. స్థానికులకు కాకుండా ఇతరులకు ఇళ్లు కేటాయిస్తున్నారంటూ పలువురు అభ్యర్థులు, స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో

2లో..

# రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం

### - వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రూ.27 కోట్ల వ్యయంతో వేగంగా జరుగుతున్న వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. తెలంగాణవ్యాప్తంగా రైల్వే మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా వికారాబాద్, తాండూర్, నాంపల్లి, సికింద్రాబాద్, చర్లపల్లి, మౌలాలి వంటి దాదాపు 40కి పైగా రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో పునర్నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వికారాబాద్ ప్రాంత వాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎస్కలేటర్, 2 లిఫ్టులు, నూతన వెయిటింగ్ హాల్, విఐపి లాంజ్, అధునాతన పార్కింగ్ వసతులతో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డితో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

#### దేశీయ టెక్నాలజీ కవచ్ వినియోగిస్తున్నట్లు వెల్లడి

భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో రైల్వే రంగానికి భారీగా నిధులు కేటాయిస్తూ అనేక వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ట్రాక్‌ల రెట్టింపు, మూడో, నాలుగో మార్గాల తవ్వకం పనులు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. తెలంగాణలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని

2లో..

# వెలిగొండ ప్రాజెక్టు వైఎస్ఆర్ స్వప్నం

### - చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారన్న జగన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వెలిగొండ ప్రాజెక్టు విషయంలో సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు వైఎస్ఆర్ స్వప్నమని, అదిప్పుడు సాకారం కావటం ఎంతో సంతోషంగా ఉందంటూ జగన్ ట్వీట్ చేశారు. ఆ మహాయజ్ఞంలో భాగస్వామి కావడం, వైసీపీ ప్రభుత్వ హయాంలో జంట సొరంగాలను పూర్తిచేసి జాతికి అంకితం చేయడం, ఇవాళ వాటి ద్వారా కృష్ణా జలాలు ప్రవహించడం తనకు ఎంతో సంతృప్తినిస్తోందని జగన్ పేర్కొన్నారు. రక్షిత మంచినీరు లేక ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న లక్షలాది కుటుంబాలకు, సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు వెలిగొండ ఒక సంజీవని వంటిదని అభిప్రాయపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు చేస్తున్న హడావిడి, పబ్లిసిటీ ఫీట్లు క్రెడిట్ చోరీ ప్రయత్నాలని జగన్ విమర్శించారు.ద"చంద్రబాబు.. వెలిగొండ చరిత్ర చాలా స్పష్టం. శిలాఫలకం మాత్రమే మీది సంకల్పం, సమగ్ర నిర్మాణం వైయస్సార్ గారిది.. కీలక జంట సొరంగాల పూర్తి మా ప్రభుత్వానిది ఇప్పుడు జరుగుతున్నది మీ క్రెడిట్ చోరీ." అంటూ జగన్ ట్వీట్ చేశారు. చంద్రబాబు ఎంతగా వక్రీకరించినా వాస్తవాలు మారవని నిజాలను దాచలేరని పేర్కొన్నారు. 1996లో ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపన రాయి వేసి చేతులు దులుపుకున్నారని 2004 వరకూ ఎనిమిదేళ్లు అధికారంలో ఉన్నా ప్రాజెక్టును ఒక్క అడుగూ ముందుకు తీసుకెళ్లలేదని జగన్

2లో..

# 69 కి.మీ వేగంతో జలప్రళయం

### - నేపాల్‌లో ఇంకేం మిగులుతుంది!



**ఖాట్మండు (ప్రశ్న న్యూస్)** నేపాల్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో ఊహించని రీతిలో పెను విపత్తు సంభవించడం తెలిసిందే. ఆ జలప్రళయం 700కి పైగా ప్రాణాలను బలిగొంది. సహాయక చర్యలు కొనసాగేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. భారీ మంచు దిబ్బ (గ్లేసియర్) కుప్పకూలడంతో

2లో..

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి

# మంత్రి పదవి

### - బాంబు పేల్చిన టీపీసీసీ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు.

2లో..

## న్యూయార్క్‌లో ఖలిస్థానీ

# మద్దతుదారుల దుశ్చర్య

### - భారత జాతీయ పతాకాన్ని కాలితో తొక్కిన ఆందోళనకారులు
### - ఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
### - దేశాన్ని, జెండాను అవమానిస్తే సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమెరికాలో ఖలిస్థానీ మద్దతుదారులు మరోసారి రెచ్చిపోయారు. భారత జాతీయ పతాకాన్ని దారుణంగా అవమానించారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే,

2లో..

# హైదరాబాద్‌కు మరో భారీ క్రికెట్ స్టేడియం!

### - 100 ఎకరాల్లో ప్రపంచంలోనే అతి పెద్దదిగా - అహ్మదాబాద్ కంటే పెద్దగా నిర్మాణం
### - ఈ ఏడాది డిసెంబర్‌లో శంకుస్థాపనకు సన్నాహాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరానికి మరో ప్రతిష్ఠాత్మక క్రీడా వేదిక అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. 2026 డిసెంబరులో ఈ స్టేడియానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతిపాదిత స్టేడియాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించడంతో పాటు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ప్రస్తుతం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న నరేంద్ర మోదీ స్టేడియం 1.32 లక్షల ప్రేక్షకుల సీటింగ్ సామర్థ్యంతో ప్రపంచంలోనే

2లో..

## 'డ్రగ్స్ ఫ్రీ వికసిత భారత్' కోసం
# ప్రచారం చేయండి

స్పష్టం చేశారు.

### యువతతో సృజనాత్మకంగా కలవాలని విజ్ఞప్తి

మత్తుపదార్థాలపై అవగాహన పెంచడానికి, మత్తు సమస్యతో పోరాడుతున్న వారికి సహాయం చేయడానికి ముందుకు వస్తున్న వారిని ఈ సందర్భంగా ప్రశంసించారు. నశా ముక్త భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్) కోసం కొత్త, సృజనాత్మక మార్గాలను అనుసరించాలని యువతను ప్రధాని మోదీ కోరారు. బలమైన నినాదాలు రూపొందించడం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని ఇచ్చే పాటలు రూపొందించడం, అలాగే విద్యార్థులు, థియేటర్ గ్రూపులు మత్తు వల్ల కలిగే నష్టాలను, దాని నుంచి బయటపడే మార్గాన్ని చూపించే నాటకాలు రూపొందించాలని ప్రధాని మోదీ సూచించారు. ఇలాంటి ప్రయత్నాలు యువతకు మత్తుపదార్థాల వ్యతిరేక సందేశాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషించగలవని అన్నారు.

### భారత్ రాష్ట్ర వెబ్‌సైట్‌ను ప్రస్తావించిన ప్రధాని మోదీ

'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ భారత చరిత్రను సులభంగా అర్థం చేసుకునేలా రూపొందించిన ఒక వెబ్‌సైట్‌ను ప్రస్తావించారు. సోషల్ మీడియాలో ఈ వెబ్‌సైట్ గురించి తనకు తెలిసిందని తెలిపారు. పీఎం మోదీ ప్రకారం, ముంబైలో నివసించే కృష్ణ శేషాద్రి 'భారత్ రాష్ట్ర' పేరుతో ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారని తెలిపారు. ఈ వెబ్‌సైట్‌లో ఎవరైనా ఒక నిర్దిష్ట సంవత్సరాన్ని ఎంచుకుని, ఆ సమయంలో భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో ఎవరి పాలన ఉందో తెలుసుకోవచ్చు. ఈ ప్రయత్నాన్ని ఆసక్తికరమని ప్రధాని పేర్కొన్నారు. దేశ చరిత్రను ఇలా సులభంగా, ఆసక్తికరంగా ప్రజలకు చేరవేయాలనే ప్రయత్నం గురించి సమాచారం మరింత మందికి చేరాలని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. దాదాపు మంత్రుల అందరి శాఖలను మార్చే పనిలో సీఎం ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేందుకు కొందరు మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

### అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ

ప్రస్తుత కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తే మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం మూడు నుంచి నాలుగు బెర్తులు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారికి అవకాశం కల్పించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.

### ఈ జిల్లాల వారికి ఈసారి అవకాశం

ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఈసారి అవకాశం కల్పించే విషయం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవిపై ఆసక్తి చూపుతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో కేబినెట్‌లోకి తీసుకుని, స్పీకర్ పదవిని మరో నేతకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా సీఎం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏఐసీసీ స్థాయిలో రాజగోపాల్ రెడ్డి పేరు ప్రతిపాదనకు వస్తే సమీకరణాలు మారే అవకాశం ఉందంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎన్నికలకు వెళతామని సీఎం పదే పదే చెబుతున్నారు. దీంతో ఆయనకు మంత్రి మండలిలో స్థానం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ పేరును పరిశీలించే అవకాశం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది.

### గవర్నర్ కోటాలో 3 స్థానాలు ఖాళీ

ఈ ఏడాది నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్‌ను ముందుగానే కేబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్ను మంత్రి మండలిలోకి తీసుకునేట్లు అయితే స్పీకర్ కుర్చీ ఖాళీ కానుంది. ఆ స్థానాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే కేబినెట్ విస్తరణతో పాటు స్పీకర్ మార్పు, మంత్రుల శాఖల మార్పు, ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్త వారికి అవకాశం ఇలా భారీ స్థాయిలో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు

ఆహ్వానం పలికారు."మూడు దశాబ్దాల నిరీక్షణకు ముగింపు, మూడు జిల్లాల్లో లక్షల మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు. మార్కాపురం జిల్లా గడ్డపై కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోంది. 30 ఏళ్లుగా కరువు పీడిత ప్రాంత ప్రజలు కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోంది. కరవుతో అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో మొదలుపెట్టిన ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం నన్ను భావోద్వేగానికి గురిచేస్తోంది. నా మనసుకు ఎంతో సంతోషానిస్తోంది." అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.వెలిగొండ అంటే కేవలం ఒక ప్రాజెక్టు కాదన్న చంద్రబాబు కరవుతో పోరాడిన రైతన్నకు భరోసాగా, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రతగా, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తుగా, పేదరికంలో మగ్గిన ప్రాంతానికి ప్రగతి మార్గంగా అభివర్ణించారు. వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందన్న చంద్రబాబు, ప్రాజెక్టు కోసం తమ భూములను, ఇళ్లను, ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ట్వీట్ చేశారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి దూసుకువచ్చే కృష్ణమ్మ జలాలు, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని, వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలుగా మారతాయని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.మరోవైపు వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని 4.473 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. సుమారుగా 23 లక్షల మంది ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుస్తుంది. ప్రాజెక్టు తొలి దశ ప్రారంభం తర్వాత శ్రీశైలం వరద జలాలను నల్లమలసాగర్ జలాశయానికి మళ్లిస్తారు. అక్కడ 53.85 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. అయితే ప్రస్తుతం 10.70 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తారు. నల్లమలసాగర్ జలాశయం నుంచి మూడు కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందిస్తారు.

# డ్రాలో పేరు వస్తే ఇల్లు సొంతమైనట్లు కాదు

బోర్డు స్పందించింది. శనివారం ఖైరతాబాద్, కూకట్‌పల్లి, అంబర్‌పేట, బహదూర్‌పుర నియోజకవర్గాలకు సంబంధించి ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వేదికల వద్ద పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దరఖాస్తుదారుల అర్హతలు, స్థానికత తదితర అంశాలపై సందేహాలు వ్యక్తం కావడంతో వాటిని పరిగణనలోకి తీసుకున్న హౌసింగ్ బోర్డు కీలక ప్రకటన విడుదల చేసింది. డ్రా ప్రక్రియలో ఎంపికైనంత మాత్రాన వెంటనే ఇల్లు కేటాయించబోమని బోర్డు స్పష్టం చేసింది. ఎంపికైన అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ సమయంలో అభ్యర్థుల నుంచి ధ్రువపత్రాలు తీసుకోలేదని, వారు అందించిన సమాచారాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించిన తర్వాతే తుది అర్హతను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో స్థానికత, కుటుంబ పరిస్థితులు, అర్హత ప్రమాణాలకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. డ్రాలో ఎంపికైన వ్యక్తులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వాటిని తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు.

అందిన ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారికి మాత్రమే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇలా డ్రా ద్వారా ప్రాథమికంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం, అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం ద్వారా అనర్హులు లబ్ధి పొందకుండా అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా స్థానికులకు అన్యాయం జరుగుతోందనే ఆరోపణలకు తావులేకుండా అర్హతలను పారదర్శకంగా నిర్ధారించడం కీలకంగా మారింది. కాగా, శనివారం నిర్వహించిన డ్రా ద్వారా నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,920 ఇళ్లకు లబ్ధిదారులను ప్రాథమికంగా ఎంపిక చేసినట్లు హౌసింగ్ బోర్డు వెల్లడించింది. అభ్యంతరాల స్వీకరణ, క్షేత్రస్థాయి విచారణ పూర్తయిన తర్వాత తుది అర్హుల జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది.

# రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు అభివృద్ధి చేస్తున్నాం

చెప్పారు. రైలు ప్రయాణ రక్షణ కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన 'కవచ్', 'కవచ్ 2.0' భద్రతా పరిజ్ఞానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని గుర్తుచేశారు. హైదరాబాద్ నుంచి ప్రస్తుతం 5 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తూ వేగవంతమైన ప్రయాణ సౌకర్యాన్ని అందిస్తున్నాయని తెలిపారు.

### త్వరలోనే కాజీపేట రైల్వే తయారీ కేంద్రం ప్రారంభోత్సవం

కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే తయారీ కేంద్రం (రైల్ తయారీ యూనిట్) పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రధాని మోదీ చేతుల మీదుగా దీని ప్రారంభోత్సవం జరుగుతుందని కిషన్ రెడ్డి వెల్లడించారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను బెంగళూరు, చెన్నై, పూణే నగరాలతో అనుసంధానించే బుల్లెట్ రైలు సర్వీసులు రానున్నాయని పేర్కొన్నారు.

### ముఖ్యమైన రైల్వే జంక్షన్ వికారాబాద్

ఇవి ఈ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలను నివారిస్తాయని స్పష్టం చేశారు. తెలంగాణలో ముఖ్యమైన రైల్వే జంక్షన్లలో వికారాబాద్ ఒకటని, రైల్వే అభివృద్ధితో పాటు వికారాబాద్ జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశించారు.

# 69 కి.మీ వేగంతో జలప్రళయం

ఏర్పడిన ప్రచండమైన ప్రవాహం ఓ ప్రాంతాన్ని పూర్తిగా తుడిచిపెట్టేసింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, రాళ్ల వరద సృష్టించిన బీభత్సం వివరాలను శాస్త్రవేత్తలు తమ నివేదికలో వెల్లడించారు. వారి కథనం ప్రకారం, లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వత శ్రేణిలో సుమారు 16,700 అడుగుల ఎత్తు నుంచి ఓ భారీ మంచు శిఖరం విరిగిపడింది. దాదాపు 1.5 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ మంచు పర్వతం, భారీగా రాళ్లు, మట్టి సహా సమీపంలోని నదిలో కుప్పకూలింది. దీంతో నదిలో సుమారు 300 అడుగుల ఎత్తున ఓ రాకాసి అల ఏర్పడింది. ఈ భీకర ప్రవాహం అసాధారణ వేగంతో పర్వత లోయల గుండా ప్రయాణించింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, బురద, రాళ్ల మిశ్రమ ప్రవాహం ధాటికి దాని మార్గంలోని గిరాంగ్ పోర్ట్ అనే ప్రాంతం పూర్తిగా జలసమాధి అయింది. క్షణాల్లోనే ఈ ప్రాంతం రూపురేఖలు లేకుండా సర్వనాశనమైందని శాస్త్రవేత్తలు వివరించారు. హిమాలయాల్లో వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి విపత్తులు సంభవిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వెలిగొండ ప్రాజెక్టు వైఎస్ఆర్ స్వప్నం

విమర్శించారు. ఎనిమిదేళ్లలో చంద్రబాబు సర్కారు వెలిగొండ ప్రాజెక్టు కోసం ఖర్చుచేసింది కేవలం రూ.10 లక్షలు మాత్రమేనని అదీ శంకుస్థాపన, సభ ఏర్పాట్లకేనని విమర్శించారు. వెలిగొండపై చంద్రబాబు చిత్తశుద్ధి ఏమిటో ఈ ఒక్క వాస్తవమే చెబుతోందని ట్వీట్లో పేర్కొన్నారు.మరోవైపు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జలయజ్ఞంలో భాగంగా వెలిగొండకు సమగ్ర రూపమిచ్చారన్న జగన్, జంట సొరంగాలు, నల్లమలసాగర్, మూడు డ్యామ్‌లు, ఫీడర్ ఛానల్, ప్రధాన కాలువల నిర్మాణాన్ని చేపట్టి ప్రాజెక్టును సాకారం చేశారని పేర్కొన్నారు. వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలన్న వైఎస్ జగన్, అవి లేకపోతే కృష్ణా జలాలు రావని తెలిపారు. వైఎస్ఆర్ ప్రారంభించిన నిర్మాణ దశలో 20.333 కిలోమీటర్లు పూర్తయ్యాయని 2014--19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కేవలం 6.686 కిలోమీటర్ల నిర్మాణం మాత్రమే జరిగిందని విమర్శించారు. వైసీపీ హయాంలో కరోనా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా మిగతా 10.568 కిలోమీటర్ల తవ్వకాన్ని పూర్తిచేశామన్నారు.టన్నెల్-1ను 2021 జనవరిలో, టన్నెల్--2ను 2024 జనవరిలో పూర్తిచేశామని 2024 మార్చి 6న జంట సొరంగాలను జాతికి అంకితం చేశామని జగన్ గుర్తు చేశారు. హెడ్ రెగ్యులేటర్లు, కాలువల అనుసంధాన పనులు చేపట్టి నీటి తరలింపునకు మార్గం అప్పుడే సిద్ధం చేశామని మొత్తం ప్రాజెక్టును చంద్రబాబు ప్రభుత్వం నిర్మించినట్లు ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. ఏ కాంట్రిబ్యూషన్ లేకుండానే మొత్తం క్రెడిట్‌ను కాజేయాలనుకోవడం చంద్రబాబు సహజ నైజానికి మరో నిదర్శనమంటూ విమర్శించారు."జంట సొరంగాలను మేం 2024లోనే సిద్ధంచేస్తే, 26 నెలలపాటు నిర్వాసితుల పునరావాసాన్ని ఎందుకు పూర్తిచేయలేదు? నల్లమలసాగర్‌కు నీటిని ఎందుకు తరలించలేదు? రెండేళ్లపాటు ప్రజలకు అందాల్సిన సాగు, తాగునీటి ప్రయోజనాలను ఎందుకు ఆలస్యం చేశారు? నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని కూడా పూర్తిగా చెల్లించలేదు. ఇప్పటికే వందలాది కుటుంబాలు తమకు పునరావాస ప్యాకేజీ కింద అందాల్సిన డబ్బులు అందలేదని, అయినా బలవంతంగా ఊళ్లు ఖాళీ చేయిస్తున్నారని, తమ ఊళ్లకు కరెంటు కట్ చేశారని, తాగునీటి సరఫరాను ఆపేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేమీ మీకు కనిపించడం లేదా?" అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ఇప్పటికైనా ప్రచారపు ఆర్భాటాన్ని పక్కనపెట్టాలని నల్లమలసాగర్‌ను నింపి, రైతులకు సాగునీరు ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు రక్షిత మంచినీరు అందించాలని జగన్ కోరారు.

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి

పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

# హైదరాబాద్‌కు మరో భారీ క్రికెట్ స్టేడియం!

అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా గుర్తింపు పొందింది. దానికంటే ఎక్కువ సీటింగ్ సామర్థ్యంతో హైదరాబాద్ స్టేడియాన్ని రూపొందించే ప్రతిపాదన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.
ప్రపంచ ప్రసిద్ధి చెందిన లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌తో పాటు ఆస్ట్రేలియాలోని ప్రముఖ క్రికెట్ స్టేడియాల తరహాలో ఆధునిక డిజైన్, ప్రేక్షకుల సౌకర్యాలు, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో ఈ వేదికను అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. స్టేడియం కేవలం క్రికెట్ మ్యాచ్‌లకే పరిమితం కాకుండా అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లు, వినోద కార్యక్రమాలకు కూడా వేదికగా ఉండేలా ప్రణాళిక రూపొందించనున్నట్లు సమాచారం. స్టేడియం నిర్మాణం, నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిధులు సమకూర్చడం, అవసరమైన భూమిని తెలంగాణ ప్రభుత్వం కేటాయించడం వంటి అంశాలపై ప్రతిపాదనలు ఉన్నట్లు తెలుస్తోంది. స్టేడియం అభివృద్ధి, నిర్వహణలో బీసీసీఐ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యంపై చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం.

### ఫ్యూచర్ సిటీలోనే ఎందుకు..?

భారత్ ఫ్యూచర్ సిటీలోనే ఈ భారీ స్టేడియాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనకు ప్రధాన కారణం కనెక్టివిటీ. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, భవిష్యత్తులో అందుబాటులోకి రానున్న మెట్రో రైలు విస్తరణతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. దీంతో దేశ, విదేశాల నుంచి వచ్చే క్రికెట్ అభిమానులకు ప్రయాణం సులభతరం కానుంది. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిస్తున్న స్పోర్ట్స్ సిటీ, పర్యాటక అభివృద్ధి, నెట్-జీరో సిటీ లక్ష్యాలకు ఈ స్టేడియం కీలక భాగంగా మారే అవకాశం ఉంది. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే హైదరాబాద్ అంతర్జాతీయ క్రికెట్ మ్యాప్‌లో కీలక స్థానాన్ని సంపాదించడంతో పాటు ప్రపంచ స్థాయి క్రీడా గమ్యస్థానంగా ఎదిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో ఉప్పల్ స్టేడియం మాత్రమే అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో స్టేడియం అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నగరం కీర్తి మరింత విశ్వవ్యాప్తం కానుంది.

## న్యూయార్క్‌లో ఖలిస్థానీ
# మద్దతుదారుల దుశ్చర్య

న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ పాల్గొన్న ఓ కార్యక్రమం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడికి చేరుకున్న కొందరు ఖలిస్థానీ సానుభూతిపరులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారు భారత జాతీయ జెండాను కిందపడేసి, కాళ్లతో తొక్కారు. అంతటితో ఆగకుండా జెండాను చించివేస్తూ దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ వీడియోలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. ఖలిస్థానీలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "మీకు ఆర్ఎస్ఎస్‌ను, బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛ ఉంది. కానీ మన దేశాన్ని అవమానించవద్దు. జాతీయ జెండాను అగౌరవపరచవద్దు. అది మీకు చాలా ప్రమాదకరం" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. విదేశీ గడ్డపై భారత జాతీయ పతాకానికి జరిగిన ఈ అవమానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశ గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కేంద్రం ఈ హెచ్చరిక ద్వారా తేల్చిచెప్పినట్టయింది.

## బాత్‌రూంలో యువతి అనుమానాస్పద మృతి..
# కనిపించకుండాపోయిన భర్త, కొడుకు



ఢిల్లీలో ఒక వివాహిత యువతి తన ఇంట్లో అనుమానాస్పదంగా మరణించింది. ఘటన జరిగిన తర్వాత నుంచి ఆమె భర్త, కొడుకు కనిపించకుండా పోయారు. ఈ ఘటన ఢిల్లీలోని ప్రహ్లాద్‌పూర్ బంగర్ గ్రామంలో శనివారం వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీలోని షాహ్‌బాద్ డైరీ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు వెల్లడించిన వివరాలివి. పోలీసులకు శనివారం యువతి మరణానికి సంబంధించి సమాచారం అందింది.దీంతో వారు ఘటన జరిగిన ప్రదేశానికి వెళ్లారు. అక్కడ 22 ఏళ్ల సబిలా ఖాటూన్ అనే యువతి ఇంటి బాత్‌రూమ్‌లో అనుమానాస్పదంగా మరణించింది. ఇంట్లో ఆమె భర్త మొహమ్మద్ లాల్‌బాబు, చిన్నారి కొడుకు లేరు. యువతి మరణించిన ప్రదేశంలోనే ఆనవాళ్లనుబట్టి పోలీసులు మర్డర్ కేసు నమోదు చేశారు. కనిపించకుండా పోయిన భర్త, చిన్నారి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనపై సబిలా సోదరుడు మొహమ్మద్ గులాబ్ పోలీసులకు ఫిర్యాదు సమాచారం ఇచ్చాడు. తాను వారి ఇంటికి వచ్చి చూసేసరికి, తన సోదరి మరణించి ఉన్నట్లు చెప్పాడు. దీంతో తాను ఈ విషయాన్ని పోలీసులకు తెలిపానన్నాడు. సబిలాకు, లాల్‌బాబుకు రెండేళ్లక్రితం వివాహం జరిగిందన్నాడు. వారిద్దరి మధ్య విబేధాలున్నట్లు తనకేం తెలియదని వివరించాడు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తరలించారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు. భర్త, చిన్నారి దొరికిన తర్వాత మిగతా వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## మహిళను చేతుల్లో మోసి ఆసుపత్రికి
# తీసుకెళ్లిన పోలీస్ అధికారి..

### వెనుక ఖాళీగా పోలీస్ వాహనం, రీల్ స్టంట్‌గా విమర్శలు



లక్నో: రోడ్డు ప్రమాదానికి గురై స్పృహ కోల్పోయిన మహిళను ఒక పోలీస్ అధికారి చేతుల్లో మోసి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఖాళీగా ఉన్న పోలీస్ వాహనం ఆయనను అనుసరించింది. ఈ నేపథ్యంలో సహాయం కోసం పోలీస్ వాహనాన్ని ఆ అధికారి వినియోగించకపోవడంతో రీల్ స్టంట్‌గా నెటిజన్లు విమర్శించారు. (Police Carries Injured Woman In Arms) ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆగస్ట్ 28న మధ్యాహ్నం వేళ థాలియా గ్రామం సమీపంలో 55 ఏళ్ల గాయత్రీ దేవిని ఒక వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన ఆమె స్పృహ కోల్పోయి రోడ్డు పక్కన పడి ఉన్నది.కాగా, గస్తీ విధుల్లో ఉన్న ఖైరీఘాట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ప్రదీప్ కుమార్ సింగ్, గాయపడి స్పృహ కోల్పోయిన ఆ మహిళను గమనించారు. వెంటనే ఆమెను తన చేతుల్లోకి ఎత్తుకున్నారు. నడుచుకుంటూ సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.మరోవైపు ఆ పోలీస్ అధికారి స్పందించి ఆ మహిళకు సహాయం అందించిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆయన చేసిన సహాయాన్ని కొందరు ప్రశంసించారు. అయితే పోలీస్ అధికారి స్వయంగా చేతుల్లో ఆ మహిళను మోసే బదులు వెనుక ఖాళీగా వస్తున్న పోలీస్ వాహనంలో వేగంగా ఆసుపత్రికి తరలించకపోవడంపై పలువురు నెటిజన్లు ప్రశ్నించారు. ఆ పోలీస్ అధికారి చర్యను రీల్ స్టంట్‌గా కొందరు అభివర్ణించారు. 'ఎక్కువ మంది ఫాలోవర్లను పొందడానికే ఈ పీఆర్ కార్యక్రమమా' అని ఒకరు ప్రశ్నించారు. ఆ మహిళను పోలీస్ వాహనంలో తరలించినట్లయితే 'సింగం' స్టైల్ ఫొటో మిస్ అయ్యేదిగా అంటూ మరొకరు ఎద్దేవా చేశారు.

## క్రికెట్ అకాడమీలో పిచ్ రోలర్ కింద నలిగి..
# 8 ఏళ్ల బాలుడు మృతి





చండీగఢ్: క్రికెట్ అకాడమీలోని పిచ్ రోలర్ అకస్మాత్తుగా ముందుకు కదిలింది. దాని కింద నలిగి 8 ఏళ్ల బాలుడు మరణించాడు. ఇది చూసి అక్కడ ఆడుకుంటున్న మిగతా పిల్లలు భయంతో పారిపోయారు. పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. గ్రాఫ్ఎష్ట్ర =శీశ్రీశ్రీవతీ జతీబంష్ట్రవం దీశీఎ) ఢిల్లీ శివారు ప్రాంతమైన హర్యానాలోని గురుగ్రామ్‌లో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని నలంద ప్రాంతానికి ఒక కుటుంబం గురుగ్రామ్‌లో నివసిస్తున్నది. ఆ కుటుంబానికి చెందిన 8 ఏళ్ల ఆకాష్ కుమార్ తన సోదరుడు నీల్, ఇతర పిల్లలతో కలిసి క్రికెట్ అకాడమీలో ఆడుకున్నాడు.కాగా, అక్కడ నిలిపి ఉంచిన మినీ పిట్ రోలర్‌కు ఒక పిల్లవాడి చేయి తగలడంతో సర్క్యూట్ బ్రేకర్ యాక్టివేట్ అయ్యింది. దీంతో ఉన్నట్టుండి అది ముందుకు కదిలింది. అక్కడున్న ఆకాష్ ఆ రోలర్ ముందు పడి నలిగిపోయాడు. ఈ ప్రమాదాన్ని చూసిన మిగతా పిల్లలు భయంతో అక్కడి నుంచి పారిపోయారు.మరోవైపు ఆకాష్ కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి అతడ్ని తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆ బాలుడు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ క్రికెట్ అకాడమీకి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన ఆ రోలర్‌ను పరిశీలించారు.అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఆ రోలర్‌ను పర్యవేక్షించడానికి అక్కడ ఎవరూ లేరని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎవరి నిర్లక్ష్యం కారణంగా ఆకాష్ మరణించాడో అన్నది కూడా అతడి కుటుంబం ఆరోపించలేదు. పోస్టుమార్టం అనంతరం ఆ బాలుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## 267 మందితో వెళ్తున్న ఫెర్రీ బోల్తా..
# 100 మందిని రక్షించిన రెస్క్యూ టీం



సైప్రస్ తీరంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ఫెర్రీ (బోటు) బోల్తా పడింది. ఈ ఫెర్రీలో 267 మంది ఉండగా.. 100 మందిని రెస్క్యూ టీంలు రక్షించాయి. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన ఆదివారం జరిగింది. సైప్రస్ రవాణా శాఖ మంత్రి ఎర్హాన్ అరిక్లి వెల్లడించిన వివరాల ప్రకారం.. సైప్రస్‌లోని కిరెనియా (గిర్నె) పోర్టు నుంచి ఒక ఫెర్రీ టర్కీలోని మెర్సిన్ ప్రావిన్స్‌లో ఉన్న టసుకు పోర్టుకు బయల్దేరింది. ఈ ఫెర్రీలో మొత్తం 267 మంది ఉన్నారు. వీరిలో 259 మంది ప్రయాణికులుకాగా.. 8 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ఫెర్రీ బయల్దేరిన కొద్దిసేపటికే, తీరానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోనే బోల్తాపడింది. దీంతో అందులోని ప్రయాణికులు నీళ్లలో కొట్టుకుపోయారు. లైఫ్ జాకెట్లు ధరించిన ప్రయాణికులు సహాయం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. లైఫ్ జాకెట్ల సాయంతో నీళ్లపైనే తేలియాడుతూ తమను తాము రక్షించుకునే ప్రయత్నం చేశారు. దీని గురించి వెంటనే సమాచారం అందుకున్న నార్తర్న్ సైప్రస్, టర్కిష్ రిపబ్లిక్‌కు చెందిన రెస్క్యూ టీంలు సహాయక చర్యలు ప్రారంభించాయి.

## సీజేపీకి రాజకీయ లక్ష్యాలు ఉండొచ్చు..
# రాజకీయాలకు అతీతంగా ఉంటేనే మేలు
### - సోనమ్ వాంగ్‌చుక్



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి బహుశా రాజకీయ లక్ష్యాలు ఉండి ఉండవచ్చని ఉద్యమకారుడు, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. తాజాగా ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీజేపీతోపాటు, గత నెలలో తాను చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సహా అనేక అంశాలపై మాట్లాడారు. అయితే, సీజేపీ రాజకీయాలకు అతీతంగా ఉంటేనే బాగుంటుందని సలహా ఇచ్చారు. "సీజేపీకి, దాని ఫౌండర్ అభిజీత్ దీప్కేకు రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే, ఈ విషయాన్ని వారేమీ నాకు చెప్పలేదు. ఇది నా అంచనా మాత్రమే.రాజకీయ లక్ష్యాలు ఉండటంలో తప్పులేదు. సీజేపీ రాజకీయంగా మారితే యువతకు అనేక అవకాశాలు వస్తాయనేది నిజం. కానీ, ఇలాంటి ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా, తటస్థంగా ఉంచితేనే మంచిది. ప్రజలు సీజేపీని నిష్పక్షపాతంగా నడిచే యువత, విద్యార్థుల ఉద్యమ శక్తిగా చూస్తున్నారు. తటస్థంగా ఉంటూ, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే సంస్థ అని భావిస్తున్నారు. ఇలా ఉంచితేనే అనేక లక్ష్యాలు సాధించవచ్చు. రాజకీయ శక్తిగాకంటే ఉద్యమ శక్తిగా ఉంచడమే మంచిది. అయితే, సమాజం నుంచి ఏమీ ఆశించకపోవడానికి సీజేపీ నేతలేమీ సన్యాసులు కాదు.నేను విశ్లేషించినంత వరకు వాళ్లు రాజకీయ శక్తిగా మారుతారు" అని వ్యాఖ్యానించారు. అభిజీత్ దీప్కే గతంలో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్న విషయంపై తనకు అవగాహన లేదన్నారు. ఇక, తాను ఆమరణ దీక్ష చేస్తున్న సమయంలో దీక్ష విరమింపజేసే అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంప్రదించామని, కానీ, ఈ విషయంలో ఆయన నుంచి సరైన స్పందన రాలేదన్నారు. ఈ విషయం పార్లమెంట్‌కు చేరాలని తాము భావించామన్నారు.రాహుల్ గాంధీ తమ దీక్షాస్థలికి వచ్చుంటే, అప్పుడు విషయానికి చాలా ప్రాధాన్యం దక్కేదని సోనమ్ వాంగ్‌చుక్ వివరించారు. కానీ, దీక్ష చేస్తున్నప్పుడు, ముగిసిన తర్వాత ఆయన తనను సంప్రదించలేదని వెల్లడించారు.

## పంజాబ్‌లో ఆప్ నేత కాల్చివేత..
# మరొకరికి గాయాలు..
### రాజకీయాలే కారణమా



పంజాబ్‌లో ఒక ఆప్ నేత దారుణ హత్యకు గురయ్యాడు. గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోపి అనే ఆమ్ ఆద్మీ పార్టీ నేతను నలుగురు దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటన పంజాబ్, ఫిరోజ్‌పూర్ జిల్లా, మామ్దోత్ పరిధిలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆప్ నేతలు గుర్‌ప్రీత్ సింగ్ (45), మరో నేత హర్‌ప్రీత్ అలియాస్ హ్యాపీ (22) ఇద్దరూ బైకుపై వెళ్తున్నారు. ఇటీవల మామ్దోత్ పంచాయతి ఆప్ అధ్యక్షుడిగా నియమితుడైన విక్కీ మౌని వారి వెనుక కారులో వస్తున్నారు. వీరంతా స్థానిక మెయిన్ బజార్ సమీపంలో వెళ్తుండగా ఒక కారులో ఆయుధాలతో వచ్చిన నలుగురు దుండగులు వీరిపై కాల్పులు జరిపారు. ముందుగా బైకుపై వెళు తున్న గుర్‌ప్రీత్ సింగ్, హర్‌ప్రీత్‌పై కాల్పులు జరిపారు. అలాగే, వెనుక కారులో ఉన్న విక్కీ మైనిపై కూడా కాల్పులు జరిపారు. కానీ, విక్కీ ఆ కాల్పుల నుంచి తప్పించుకున్నాడు. అతడికి ఎలాంటి గాయాలు కాలేదు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడ్నుంచి కారులో తప్పించుకుని వెళ్లారు. ఈ ఘటనలో గుర్‌ప్రీత్ సింగ్, హర్‌ప్రీత్.. ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే గుర్‌ప్రీత్ సింగ్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. హర్‌ప్రీత్ పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో అతడిని మెరుగైన చికిత్స కోసం లూథియానా తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

గత మున్సిపల్ ఎన్నికల సమయంలో తలెత్తిన విబేధాలే ఈ కాల్పులకు కారణం అని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ కాల్పులకు పాల్పడిన నిందితుల్ని పోలీసులు గుర్తించారు. వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు సీనియర్ ఎస్పీ భూపిందర్ సింగ్ తెలిపారు.

# కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీల గొంతు కోద్దాం అనుకున్నారా..?
### - మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్




స్వాతంత్రం వచ్చిన తరువాత మెజారిటీ వర్గాలకు న్యాయం జరుగడం లేదు.. రాజకీయంగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అణిచివేయబడ్డారు.. వాళ్ల ఓట్లతో అధికారంలోకి వచ్చి వాళ్ల కోసం ఏం చేయడం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎంత జనాభా ఉంటె అంత రిజర్వేషన్లు ఇవ్వాలని రాహుల్ గాంధీ చెప్పి నోరుమెదపడం లేదని.. సెన్సస్ లో బీసీ జన గణన చేస్తామని బీజేపీ ఆచరించడం లేదన్నారు.భారత దేశంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలంటే మెజారిటీ వర్గాలను అక్కున చేర్చుకోవాలి. తమిళనాడు, పంజాబ్, కర్ణాటక, తెలంగాణాలో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు రాష్ట్రాల్లో ఇచ్చారు.. న్యాయపరంగా ఇబ్బందులు వస్తున్నాయి.. రాజ్యాంగ బద్దంగా లేదని కోర్టులు కొట్టేస్తున్నాయి. సెన్సెస్ లో లేనప్పుడు ఇంత పెర్సెంటేజి అని రిజర్వేషన్లు ఎలా ఇస్తారని న్యాయస్థానాలు అడుగుతున్నాయి. రాజ్యాంగ సవరణ చేయాలి.. సెన్సస్ లో బీసీ గణన చేయాన్నారు శ్రీనివాస్‌గౌడ్ .

కాంగ్రెస్ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తారా...? పార్లమెంట్ స్థంభింపజేస్తారా..? ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించి ప్రభుత్వాన్ని నిలదీసి ప్రతి కులానికి ఒక నంబరింగ్ ఇచ్చి ఎంత మంది ఉన్నారో గణన చేయించాలన్నారు. ప్రతీ కులానికి ఒక నంబరింగ్ ఇవ్వకుండా న్యాయం ఎలా చేస్తారు. సర్వేతో ఒక్క రూపాయి ఖర్చు కాదు.. హౌస్ హోల్డ్ సెర్వేలో ఎక్కడా కుల గణన ప్రస్తావన లేదు.. కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, లడక్, ఉత్తరాఖండ్‌లో గణన వచ్చే నెల ప్రారంభమతుంది. ఈ రోజు వరకు కూడా బీసీ ఎన్ని కులాలు ఉన్నాయ్.. ఏ కులానికి ఏ నెంబర్ ఇచ్చారో లేదు.. ఎవరి చెవిలో పూలు పెడదాం అనుకున్నారు.. ప్రతిపక్ష పార్టీ మాట్లాడటం లేదు.. అధికార పార్టీ అసలు పట్టించుకోవడం లేదు.. వీళ్ల సంఖ్య తెలిస్తే పునాదులు కదులుతాయని భయపడుతున్నారా..? అని శ్రీనివాస్‌గౌడ్ అడిగారు.

ఓబీసీలకు చట్ట సభల్లో జనాభాకు అనుగుణంగా లేరు..బ్యాంకులను ఎగ్గొటిన వారిలో బీసీలు లేరు.. మోసం చేసిన వారిలో కూడా బీసీలు లేరు.. గణన వాయిదా వేసి ఎస్సీ, ఎస్టీ ల తరహా కులాలకు నంబరింగ్ ఇవ్వాలి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులాన్ని ఒక్కో విధంగా పిలుస్తారు.. దానిపై పరిశీలన చేసి జాబితా తయారు చేసి.. నంబరింగ్ ఇవ్వాలన్నారు. రూ.80 కోట్ల జనాభా ఉన్న ఓబీసీలకు చట్ట సభల్లో జనాభాకు అనుగుణంగా లేరు.. చట్టాలు తయారు చేసే వద్ద కూడా మెజారిటీకు తగినట్టు ఉన్నప్పుడే న్యాయం జరుగుతుంది. గణన వాయిదా వేసి బీసీ కులాలకు నంబరింగ్ ఇవ్వకుంటే ఓబీసీలు బీజేపీని క్షమించరని శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. చట్ట సభల్లో రిజర్వేషన్లు ఇవ్వండి.. సెన్సస్ లో బీసీ గణన చేయండి. మేమే చట్టాలు తయారు చేసుకుంటాము.. జోలె పట్టుకొని ఎవరిని అడుక్కోవాల్సిన పరిస్థితి ఉండదు.ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే యువత పోరాటం చేసినట్టు ఓబీసీ ఆందోళన బాట పడుతారు. రాహుల్ గాంధీ మాటలకు పరిమితం కాకుండా ఓబీసీలకు మద్దతుగా పోరాటం చేయాలి.. పార్టీలకు ఐక్యంగా ఓబీసీలు మీ పోరాటానికి అండగా ఉంటామన్నారు. ప్రధానమంత్రి ఓబీసీ రిజర్వేషన్లు చేస్తే చరిత్రలో నిలిచిపోతారు. విద్య..ఉపాధి..రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి.. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురవుతారన్నారు. మాట తప్పితే అన్ని వర్గాలతో సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు.

ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్లు కొట్టేసిన విషయం తెలిసి కూడా తెలంగాణలో చట్ట బద్దంగా ముందుకు వెళ్లలేదు.. కేంద్రంపై నెపం నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారు.. న్యాయపరంగా చిక్కులు లేని అంశాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేసి చిత్త శుద్ధి నిరూపించుకోవాలన్నారు. రిజర్వేషన్ల కల్పనపై కూడా చట్టబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు శ్రీనివాస్‌గౌడ్ .

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పి విల్సన్, ప్రొఫెసర్ సూరజ్ మండల్, మాజీ ఐఎస్ఐ అధికారి, తెలంగాణ ఇంటలెక్టువల్స్ ఫోరమ్ కన్వీనర్ చిరంజీవులు, ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, డా. అనిల్ జైహింద్, ప్రొఫెసర్ రతన్ లాల్, బిసి పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలగోని బాల్ రాజు గౌడ్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్, దుర్గయ్య గౌడ్, హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రాజేష్ దత్తా తదితరులు పాల్గొన్నారన్నారు.

## గర్భవతి అయిన ప్రియురాలిపై అనుమానం..
# విషం కలిపిన డ్రింక్ తాగించి హత్య



ముంబై: గర్భం దాల్చిన ప్రియురాలు మరో వ్యక్తితో మాట్లాడటంపై ప్రియుడు అనుమానించాడు. విషం కలిపిన కూల్ డ్రింక్ తాగించి కూల్‌గా హత్య చేశాడు. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం బయటపడటంతో అతడ్ని అరెస్ట్ చేశారు. (మీుఅ ఖఅశ్రీశ్రీం ాశీజవతీ) మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. చెంబూర్ ప్రాంతానికి చెందిన 25 ఏళ్ల ఆశిష్ మగర్, తన ప్రియురాలైన 19 ఏళ్ల విష్ణుమాయ, ఆమె బంధువైన మహిళతో కలిసి వారి ఇంట్లో నివసిస్తున్నాడు. రెండున్నర నెలల గర్భవతి అయిన విష్ణుమాయ ఆగస్ట్ 25న మరో ఫ్రెండ్‌తో కలిసి ఉండటం ఆశిష్ చూశాడు. ఆమెపై అతడు అనుమానం వ్యక్తం చేయడంతో ఆ జంట మధ్య వాగ్వాదం జరిగింది. అయితే కొద్దిసేపటికే ఆ గొడవ సద్దుమణిగింది.కాగా, ఆ గొడవ తర్వాత ఆశిష్ విషం కలిపిన కూల్ డ్రింక్‌ను విష్ణుమాయకు ఇచ్చాడు. అది తాగిన తర్వాత ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమించడంతో మరో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు విష్ణుమాయ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించగా విషం సేవించడం వల్లే ఆమె మరణించినట్లు రిపోర్ట్‌లో తేలింది. దీంతో ఆ యువతి మరణంపై పోలీసులు దర్యాప్తు చేశారు. మరోవైపు విష్ణుమాయ మరణానికి ముందు ప్రియుడు ఆశిష్‌తో గొడవ జరిగినట్లు పోలీసులకు తెలిసింది. అలాగే అతడు ఇచ్చిన కూల్ డ్రింక్ తాగిన తర్వాత తన ఆరోగ్య పరిస్థితి విషమించినట్లుగా ఆమె తమకు చెప్పిందని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆశిష్‌ను అనుమానించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అతడు బుకాయించేందుకు ప్రయత్నించినప్పటికి ఆధారాల మేరకు నిందితుడిగా నిర్ధారించి అరెస్ట్ చేశారు. ఆశిష్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా ఐదు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగించినట్లు పోలీస్ అధికారి తెలిపాడు. ఈ కేసుపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## పెళ్లి రద్దుపై ఆగ్రహించిన వ్యక్తి..
# మహిళ, ఆమె సోదరిపై యాసిడ్ దాడి



లక్నో: ఒక వ్యక్తి డ్రగ్స్‌కు బానిసైనట్లు తెలుసుకుని అతడితో జరుగాల్సిన పెళ్లిని మహిళ కుటుంబం రద్దు చేసింది. ఆగ్రహించిన అతడు ఆమె ఇంటికి వెళ్లాడు. ఆ మహిళతో పాటు ఆమె సోదరిపై యాసిడ్‌తో దాడి చేశాడు. మహిళ కుటుంబ సభ్యులు అతడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. (Man Throws Acid At Ex-Fiancee) ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆవాస్ వికాస్ కాలనీకి చెందిన హర్ష్ భాటికి ఒక యువతితో పెళ్లి నిశ్చియమైంది. అయితే అతడు డ్రగ్స్‌కు బానిసైనట్లు తెలుసుకున్న కాబోయే భార్య కుటుంబం పెళ్లిని రద్దు చేసింది. కాగా, పెళ్లి రద్దు కావడంపై హర్ష్ ఆగ్రహించాడు. శనివారం రాత్రి యాసిడ్ బాటిల్స్‌తో ఆ యువతి ఇంటికి చేరుకున్నాడు. ఆమె తలుపు తీయగానే యాసిడ్ పోశాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన ఆ మహిళ సోదరిపై కూడా యాసిడ్ పోశాడు. వారి కేకలు విన్న కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. పారిపోయేందుకు ప్రయత్నించిన హర్ష్‌ను పట్టుకున్నారు. ఈ సమాచారం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులకు అతడ్ని అప్పగించారు. బాధిత మహిళల తండ్రి ఫిర్యాదు ఆధారంగా హర్ష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాన్పు ఒక్కటి.. పిల్లలు ఇద్దరు..
# కన్నోళ్లు నలుగురు..!




ఆస్ట్రేలియా లో వైద్య రంగాన్ని ఆశ్చర్యపరిచిన ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. ఒకే మహిళ ఒకే కాన్పులో ఇద్దరు శిశువులకు జన్మనిచ్చింది. అయితే ఆ ఇద్దరు పిల్లల తల్లిదండ్రులు వేర్వేరు కావడం ఈ కథలో అసలు విశేషం. ఈ అసాధారణ ఉదంతం క్విన్స్‌లాండ్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. క్విన్స్‌లాండ్‌కు చెందిన 27 ఏళ్ల మహిళ అప్పటికే ఐదుగురు పిల్లల తల్లి. గర్భాశయంలేని కారణంగా పిల్లలు కనలేని మరో జంట కోసం ఆమె సరోగసీ ద్వారా బిడ్డను కనడానికి ముందుకొచ్చింది.ఒప్పందం ప్రకారం.. 2025 ఏప్రిల్‌లో వైద్యులు ఆ జంటకు చెందిన పిండాన్ని సరోగేట్ తల్లి గర్భంలోకి ప్రవేశపెట్టారు. అయితే సరిగ్గా అదే సమయంలో ఆమె తన భర్తతో సహజంగా కూడా గర్భం దాల్చింది. కొన్ని వారాల తర్వాత నిర్వహించిన అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లో ఆమె గర్భంలో రెండు పిండాలు పెరుగుతున్నట్లు వైద్యులు గుర్తించారు. జన్యు పరీక్షలు చేయగా అసలు విషయం బయటపడింది. ఆ ఇద్దరిలో ఒకరు సరోగసీ కోరిన జంటకు చెందిన బిడ్డ కాగా.. మరొకరు (అబ్బాయి) సరోగేట్ తల్లి, ఆమె భర్తకు చెందిన సొంత బిడ్డ అని తేలింది. 2025 నవంబర్‌లో ఆమె సిజేరియన్ ద్వారా ఒకేసారి ఇద్దరు శిశువులకు జన్మనిచ్చింది.ఈ ఘటనతో చట్టపరమైన చిక్కులు తలెత్తాయి. క్విన్స్‌లాండ్ సరోగసీ చట్టం ప్రకారం.. ఒకే కాన్పులో పుట్టిన తోబుట్టువులను విడదీయడం, ఒక బిడ్డకు మాత్రమే తల్లిదండ్రుల హక్కులు ఇవ్వడం సాధ్యం కాదు. దాంతో తాము కోరుకున్న జంట తమ కుమార్తెకు చట్టపరమైన హక్కుల కోసం కోర్టును ఆశ్రయించింది. ఈ అసాధారణ కేసును విచారించిన చిల్డ్రన్స్ కోర్ట్ న్యాయమూర్తి జోడీ వూల్డ్రిడ్జ్ ఒక చారిత్రక తీర్పు వెలువరించారు. ఇద్దరు శిశువులు ఒకే గర్భంలో పెరిగినప్పటికీ వేర్వేరు సమయాల్లో, వేర్వేరు పద్ధతుల్లో గర్భం దాల్చినందున వీరిని "జన్మతః తోబుట్టువులు" గా పరిగణించలేమని, కేవలం "గర్భాశయ కవలలు" గా మాత్రమే చూడాలని స్పష్టంచేశారు.ఈ తీర్పుతో సరోగసీ కోరుకున్న జంటకు తమ కుమార్తెపై చట్టపరమైన హక్కులు లభించాయి. ప్రస్తుతం రెండు కుటుంబాలు తమతమ పిల్లలను సంతోషంగా పెంచుకుంటున్నాయి. ఆ ఇద్దరు పిల్లలకు వారి పుట్టుక వెనుక ఉన్న ప్రత్యేకతను తగిన వయసులో తెలియజేయాలని నిర్ణయించుకున్నారు.

## రోడ్డు నిర్మాణం కోసం
# ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాదయాత్ర



అభివృద్ధి పనులను అడ్డుకోవడం కోసం కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తున్న తీరుపై మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కదం తొక్కనున్నారు. రోడ్డు నిర్మాణం కోసం సునీతా లక్ష్మారెడ్డి పాదయాత్ర చేపట్టనున్నారు. ప్రభుత్వ విధానాలు అర్థంచేసుకోవడం సోమవారం ఉదయం 8 గంటలకు వెల్దుర్తి నుంచి మెదక్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెల్దుర్తి నుంచి పిల్లి కొట్టాల, మెదక్ వరకు రోడ్డు నిర్మాణం కోసం కేసీఆర్ ప్రభుత్వం 18 లక్షలు మంజూరు చేసింది. కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అధికారులు టెండర్లు పిలిచి అగ్రిమెంట్ చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులను రద్దు చేసింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని సునీతా లక్ష్మారెడ్డి వెల్దుర్తి నుంచి పాదయాత్ర చేయాలని

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం



**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్రలోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది.

ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది.మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలొకొంది.

# అనిల్‌లో నిర్వేదం..

**నెల్లూరు :** పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు.మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది.ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

**ఒంగోలు :** ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకుంటోంది.రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు. టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రా మిక నీరు సరఫరా కానుందిఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

# వారసులొస్తున్నారు.....

**విజయవాడ :** ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# హీట్ పుట్టిస్తున్న పులివెందుల




**కడప** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది.ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. నియోజకవర్గంలో చాలామంది వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు, సామాన్య ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతుండటంతో జగన్ కోటలో బీటలు వారుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని ఎలాగైనా గెలిచి జగన్ సొంత నియోజకవర్గంలోనే ఆయనకు రాజకీయంగా పెద్ద షాక్ ఇవ్వాలని కూటమి కూకటివేళ్లతో కష్టపడుతోంది.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్




**విజయవాడ :** విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు.చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్? కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు.ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు.

# బీజేపీ, అకాలీదళ్ పొత్తు



**ఛండీఘడ్ :** పంజాబ్ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈసారి ఎలాగైనా అక్కడ అధికారం చేజిక్కించుకోవాలని పావులు వేగంగానే కదుపుతోంది. అయితే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీ.ఎల్. సంతోష్ ఓ కీలక ప్రకటన చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. అయినా అటు బీజేపీ, ఇటు అకాలీదళ్ పొత్తు కోసం ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. అడపా దడపా ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతూనే వున్నాయి. కానీ.. ఓ పట్టాన తుది దశకు రావడం లేదు.ఇంత జరుగుతున్నా.. పొత్తుపై రెండు పార్టీలూ ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. అయితే.. ఇరు పార్టీల మధ్య పొత్తు వుండాలన్న తుది నిర్ణయానికి మాత్రం వచ్చేశాయి. ఈ సారి బీజేపీ అక్కడ పై చేయి సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తానే సీనియర్ భాగస్వామిగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యింది. దీంతో అకాలీదళ్ అటూ ఇటూగా వున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సీనియర్ భాగస్వామి అయితే మాత్రం సీట్ల విషయంలో దెబ్బే.. అన్నట్లుగా ఆలోచిస్తోంది. ఎక్కువ సీట్లు అడగడానికి అకాలీదళ్ కి ఛాన్స్ వుండకపోవచ్చు.అయితే.. పొత్తుకు అవకాశం ఉందనడానికి ఒక కీలక సూచన ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాల్లోని సీట్లకు సిద్ధం కావద్దని ఎస్ఏడీ తమ నాయకులకు సూచించినట్లు సమాచారం. దీనిని బట్టి, గత పొత్తులో కంటే బీజేపీ ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంతలో, పంజాబ్‌లో బీజేపీ తన సంస్థాగత సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా, మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సన్నద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.అకాలీ దళ్ మరియు బీజేపీలు దీర్ఘకాల మిత్రపక్షాలుగా ఉన్నాయి, అయితే వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా సెప్టెంబర్ 2020లో అవి విడిపోయాయి.ఇవి కలిసి ఆరు లోక్‌సభ (1998, 1999, 2004, 2009, 2014 మరియు 2019) మరియు ఐదు పంజాబ్ అసెంబ్లీ (1997, 2002, 2007, 2012 మరియు 2017) ఎన్నికలలో పోటీ చేశాయి. విడివిడిగా పోటీ చేసిన 2022 పంజాబ్ ఎన్నికలలో, అకాలీ దళ్ కేవలం మూడు స్థానాలను మాత్రమే గెలుచుకుని దారుణంగా పడిపోయింది. బీజేపీ రెండు స్థానాలనే గెలుచుకుంది.

## కాపర్ బాటిల్ వాడకంలో
# ఈ రూల్స్ పక్కా.. లేదంటే తొక్కిపడేస్తది..

ఈ మధ్య కాలంలో కాపర్ వాటర్ బాటిల్స్ బాగా ట్రెండ్ అవుతున్నాయి. వీటితో ఉన్న ప్రయోజనాలు కారణం చాలామంది ఇవి వాడుతున్నారు. ఇది కేవలం నీళ్ళు పోసి వాడుకొనేది కాదు. రాగి ఒక రియాక్టివ్ మెటల్. దానిని జాగ్రత్తగా వాడాలని నిపుణులు చెబుతున్నారు. దానిని వాడి ఆరోగ్యంగా ఉండటానికి కొన్ని రూల్స్ ఉన్నాయి. మరి ఆ రూల్స్ ఏంటి.? నీరు తప్ప మరేదైనా కాపర్ బాటిల్?లో నింపకండి: జ్యూస్, నిమ్మకాయ నీరు, కార్బోనేటేడ్ పానీయాలు మీకు రిఫ్రెషింగ్‌గా అనిపించవచ్చు. కానీ వీటిని రాగి సీసాలో వేస్తే.. వీటిలోని ఆమ్లత్వం రాగితో చర్య జరిపి, అనారోగ్యంగా మారుతాయి. పుల్లగా ఉండే నిమ్మకాయ నీరు ఉదార ఆరోగ్యాన్ని నాశనం చేస్తుంది. ఇందులో గది ఉష్ణోగ్రతలో నీటిని మాత్రమే నింపండి. కాపర్ బాటిల్‌లో నీటిని ఎక్కువసేపు నిల్వ ఉంచవద్దు: కాపర్ బాటిల్?లో రాత్రిపూట అంత నీటిని ఉంచి మరుసటి రోజు ఉదయం తాగడం మంచిదే. కానీ రోజుల తరబడి ఆ బాటిల్?లో నీళ్లు ఉంచవద్దు. రాగి సీసాలోలో నీరు ఎక్కువ రోజులు ఉంటే, లోహనన్ని ఎక్కువ గ్రహిస్తుంది. ఇది అనారోగ్యానికి కారణం అవుతుంది. సరిగ్గా శుభ్రం చేయడం మర్చిపోవద్దు: రాగి సీసా శుభ్రం చేయడానికి గట్టి స్క్రబ్ అవసరం లేదు. కానీ దీని క్రమం తప్పకుండా శుభ్రపరచడం అవసరం. లేకపోతే, మరకలు, ఆకుపచ్చని మచ్చల ఏర్పడి ఆక్సీకరణకు గురవుతుంది. ఇది అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

అందుకే కాపర్ బాటిల్?ని ఉప్పు, చింతపండు వంటి వాటితో క్లీన్ చెయ్యండి. కడిగిన తర్వాత తడిగా ఉంచవద్దు: మూసి ఉన్న రాగి సీసా లోపల తేమ, గాలి రంగు మారడాన్ని వేగవంతం చేస్తుంది. వాసనకు దారితీస్తుంది. కడిగిన తర్వాత మూత తెరిచి ఉంచి బాటిల్‌ను పూర్తిగా గాలిలో ఆరనివ్వండి. ఈ ఒక చిన్న అలవాటు మీ బాటిల్‌ను తాజాగా ఉంచుతుంది. లేదంటే తర్వాత వాడినప్పుడు అనారోగ్యానికి కారణం అవుతుంది. ఇందులో నీరు అతిగా తాగకండి: అవును, రాగి బాటిల్?తో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ దీనిలో నీరుకి ఎక్కువగా తాగడం సరైనది కాదు. కాదని తాగితే వికారం, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో రాగి విషప్రభావం కూడా చూపించవచ్చు. కాపర్ బాటిల్?లో రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసుల నీరు సరిపోతుంది.

# గొంతు నొక్కితే.. గర్జిస్తా

## జోగి రమేష్ సంచలన వ్యాఖ్యలు

- 'ఇరిగేషన్ భూముల కబ్జాతో నాకు సంబంధం లేదు.. విచారణకు సిద్ధం'

- కుటుంబాన్ని టార్గెట్ చేసి వేధిస్తున్నారు..- బీసీని కాబట్టే కక్ష సాధింపు-చంద్రబాబు వ్యాఖ్యలపై ఫైర్.. రాధాకృష్ణ కథనాలపైనా తీవ్ర ఆగ్రహం

ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) రాజకీయ ఆరోపణలు, కేసులు, కుటుంబ వ్యవహారాలు, భూముల వివాదాలతో తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారంటూ మాజీ మంత్రి జోగి రమేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'నా గొంతు నొక్కాలని చూస్తున్నారు.. నా ప్రాణం ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఆపలేరు' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇరిగేషన్ భూముల కబ్జా వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన పాత్రపై ఎవరితో అయినా విచారణ జరిపించుకోవచ్చని సవాల్ చేశారు.

### కుటుంబమే లక్ష్యమా.?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేస్తోందని జోగి రమేష్ ఆరోపించారు. తనపై మాత్రమే కాకుండా కుమారుడు, సోదరుడిపైనా కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. రాజకీయ పోరాటాన్ని కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాల్లోకి తీసుకెళ్లడం సరికాదని మండిపడ్డారు.

### భూముల ఆరోపణలపై సవాల్

ఇరిగేషన్ భూముల కబ్జా వ్యవహారంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని మాజీ మంత్రి స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాల్ చేశారు. గుంటూరులో భూములు కబ్జా చేశానంటూ జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

### బీసీని కాబట్టేనా.?

తాను బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని కావడం వల్లే తన కుటుంబం మొత్తాన్ని టార్గెట్ చేస్తున్నారని జోగి రమేష్ ఆరోపించారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని, ఎవరినీ మోసం చేయలేదని చెప్పారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేకనే కేసులు, ఆరోపణలు తెరపైకి తెస్తున్నారని విమర్శించారు.



### చంద్రబాబు వ్యాఖ్యలపై ఫైర్

తన కుటుంబం మత మార్పిడులను ప్రోత్సహించిందంటూ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై జోగి రమేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థాయికి తగిన మాటలేనా అని ప్రశ్నించారు. తన కుటుంబానికి సంబంధించిన వివరాలను ఇప్పటికే వెల్లడించామని చెప్పారు.

### 'ఆలయాలకూ.. చర్చిలకూ వెళ్తాం'

తాము ఆలయాలకు వెళ్తామని, చర్చిలకు కూడా వెళ్తామని జోగి రమేష్ తెలిపారు. తన ఇంట్లో చండీయాగం నిర్వహించామని చెప్పారు. కుటుంబం పాటించే మత విశ్వాసాలను కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదని అన్నారు.

### రాధాకృష్ణపై ఘాటు విమర్శలు

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణపై జోగి రమేష్ తీవ్ర విమర్శలు చేశారు. తన కుటుంబానికి సంబంధించిన అంశాలపై ప్రసారం అవుతున్న కథనాలను తప్పుబట్టారు. రాజకీయ విమర్శలను వ్యక్తిగత వ్యవహారాలతో ముడిపెట్టి తమ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

### 'విచారణ జరపండి.. వెనక్కి తగ్గను'

ఇరిగేషన్ భూముల వ్యవహారంలో తనకు సంబంధం లేదని చెబుతున్న జోగి రమేష్.. తన పాత్రపై విచారణ జరిపించుకోవచ్చని మరోసారి స్పష్టం చేశారు. కేసులు, ఆరోపణలు, రాజకీయ ఒత్తిళ్లతో తనను భయపెట్టలేరని అన్నారు. 'నా ప్రాణం ఉన్నంత వరకు నా గొంతు నొక్కలేరు' అంటూ సవాల్ విసిరారు.

## కాంగ్రెస్ విఫల పాలనపై బీఆర్ఎస్ నిరసనలను విజయవంతం చేయాలి..

### మాజీ మంత్రి పువ్వాడ పిలుపు



బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల తరపున ప్రశ్నిస్తూ ఉద్యమిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 10వ తేదీ వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పువ్వాడ వెల్లడించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో, పరిపాలనలో పూర్తిగా విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజలను చైతన్యపరిచేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు.ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## వైభవంగా మార్వాడీల కావడి యాత్ర..

### హరిహర మహాదేవ' నామస్మరణతో సాగిన భక్తుల పాదయాత్ర



కారేపల్లి, ఆగస్టు 30: మార్వాడీల కావడి యాత్ర ఆదివారం వైభవంగా సాగింది. ఖమ్మం పట్టణంలోని రామ్‌దేవ్ బాబా మందిరం వద్ద ఉదయాన్నే ప్రారంభమైన ఈ యాత్ర ఎన్టీఆర్ సర్కిల్, ఖానాపురం, బల్లేపల్లి, రఘునాథపాలెం, మంచుకొండ, బూడిదంపాడు, పండితాపురం, ముచ్చర్ల, లింగాల, కారేపల్లి క్రాస్ రోడ్, సింగరేణి, అప్పాయిగూడెం, భాగ్యనగర్ తండా, ఆలియా తండాల మీదుగా ఇల్లెందు పట్టణంలోని రామ్‌దేవ్ బాబా ఆలయానికి చేరుకుంది.మార్వాడీ కుటుంబాలకు చెందిన వందలాది మంది భక్తులు కావడి యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో కుటుంబ బంధాలు బాగుండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు విస్తారంగా కురవాలని కోరుకుంటూ మార్వాడీలు కావడి యాత్ర చేపడతారు.భక్తులు కావడికి పవిత్ర జలాలను కట్టుకుని 'బోల్ బమ్', 'హరిహర మహాదేవ' నామస్మరణ చేస్తూ రామ్‌దేవ్ బాబా, శివాలయాలకు చేరుకున్నారు. యాత్రలో మహిళలు, చిన్నారులు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాలినడకన ఇల్లెందులోని ఆలయానికి చేరుకున్న భక్తులు పవిత్ర జలంతో అభిషేకాలు, పూజలు నిర్వహించి కావడి యాత్రను ముగించారు.

## మూడుదశాబ్దాల కల.. కృష్ణమ్మ జలధార

# నేడు వెలిగొండ ఫేజ్-1 ప్రారంభం

- ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే.. -తొలి దశకు ప్రారంభోత్సవం
- 10.70 టీఎంసీల కృష్ణా జలాల విడుదల.. - 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు
- 4 లక్షల మందికి తాగునీరు.. కరవు నేలకు కొత్త ఆశలు

అమరావతి(ప్రశ్న న్యూస్) మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కానుంది. కరవు కాటుతో అల్లాడుతున్న మార్కాపురం ప్రాంతానికి కృష్ణమ్మ జలాలను మళ్లించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు తొలి దశకు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టనున్నారు. 'వెలిగొండ జలసిరులు--అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మూడు దశాబ్దాల అనంతరం అదే ప్రాజెక్టు ఫేజ్--1ను ఆయన స్వయంగా ప్రారంభించనుండటం ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు.. ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన ఘట్టానికి మార్కాపురం వేదిక కానుంది.వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్య, సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న మార్కాపురం ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు జీవనాధారంగా మారనుంది. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేయడం.. అక్కడి నుంచి ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించడం ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాలకు ప్రయోజనం చేకూరనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో పాటు సుమారు 23 లక్షల మందికి తాగునీటి సౌకర్యం లభించనుంది.భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి తగ్గడంతో ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలకు కూడా ఉపశమనం కలగనుంది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా వెలిగొండ కీలక అడుగుగా మారనుంది.1996లో శంకుస్థాపన జరిగినప్పటి నుంచి వెలిగొండ ప్రాజెక్టు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలు ప్రాజెక్టు పురోగతిని ప్రభావితం చేశాయి.2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలిగొండను ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. సొరంగాలు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసితుల పునరావాసం, పరిహారం చెల్లింపులపై దృష్టి సారించింది. నిర్వాసిత కుటుంబాలకు కేవలం 48 రోజుల వ్యవధిలో రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లించినట్లు ప్రభుత్వం తెలిపింది. గెజిట్, జాబితాల్లో పేర్లు లేని వారికి మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్లు నిండిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించినట్లు వెల్లడించింది.
ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10.25 గంటలకు వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు.
మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడుతున్న వేళ వెలిగొండ తొలి దశ ప్రారంభం కరవు ప్రాంత ప్రజల్లో కొత్త ఆశలు నింపుతోంది. కృష్ణమ్మ జలాలు పొలాలకు చేరితే కరవు నేల పచ్చగా మారడమే కాకుండా.. వ్యవసాయం, తాగునీరు, ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి రంగాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలకనుంది.






## కూలర్‌ను పక్కకు జరుపుతుండగా కరెంట్ షాక్..

### యువకుడు మృతి



దస్తురాబాద్, ఆగస్టు 30: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన ఎంబాడి సతీష్ (27) ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న సతీష్ శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో ఉన్న ఇనుప ఎలక్ట్రిక్ కూలర్‌ను పక్కకు జరిపే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే దస్తురాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి భీమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## యువజన సంఘాలను అణిచివేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి..

### రాజీనామాకు డిమాండ్

గన్నేరువరం, : కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి నుండి గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని పోత్తూరు వరకు డబుల్ నిర్మాణం పూర్తి చేయాలని యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఒకరోజు నిరాహార దీక్షకు పోలీసులు అనుమతి లేకపోయినా యువజన సంఘాలు అనుకున్న సమయానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజల మద్దతుతో నిరాహార దీక్ష చేపట్టిన స్థలానికి చేరుకోగా కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు వారిని బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్ వాహనాల్లోకి ఎక్కించారు. ఈ క్రమంలో పోలీసులకు, యువజన సంఘం నాయకులకు మధ్య పెనుగులాట జరిగింది. పలువురు యువజన సంఘాల నాయకులకు గాయాలయ్యాయి. అరెస్టు చేసి వారిని తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. యువజన సంఘాల నాయకులకు మద్దతు తెలపడానికి వచ్చిన ప్రజలు శాంతియుతంగా రోడ్డు కోసం నిరాహార దీక్ష చేస్తున్న నాయకులను అరెస్టు చేయడం ఏంటని, రోడ్డు పరిస్థితి ఎలా ఉందో అధికారులకు తెలియదని మండల ప్రజలు పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల అధ్యక్షుడు కాలువ నాగరాజు, మాజీ జెడ్పిటిసి మాడుగుల రవీందర్, రెడ్డి,అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన 100 రోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తానన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారంలోకి వచ్చిన 1000 రోజులు పూర్తయినా కంకర రోడ్డు వైపు కన్నెత్తి ఎందుకు చూడడం లేదని ప్రశ్నించారు. అధికారం కోసం నాడు యువజన సంఘాలతో కలిసి ధర్నాలు చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నేడు యువజన సంఘాలను అణిచివేస్తున్నారని మండిపడ్డారు.

### డబుల్ రోడ్డు కోసం నినదించిన వారిపై అక్రమ కేసులు..

ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యమాన్ని ఆపలేరని హితవు పలికారు. ఎమ్మెల్యే కవ్వంపల్లికి చిత్తశుద్ధి ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి యువజన సంఘాలతో కలిసి నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డు కోసం నినదించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.యువజన సంఘాలకు పోటీగా కాంగ్రెస్ నాయకులు ఓ ర్యాలీ అదే రోజు చేయడం ఏంటని ప్రశ్నించారు. నిరాహార దీక్ష చేపడతామని పోలీస్ శాఖను అనుమతులు అడుగుతే అధికార బలంతో అనుమతులు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. గన్నేరువరం మండలంలో జరుగుతున్న అరాచకాన్ని మండల ప్రజలు గమనిస్తున్నారన్నారు.



రోడ్డు వేయడం చేతగాని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కారేపల్లి శివాలయ అభివృద్ధికి

# బెల్ డీజీఎం శ్రీకారం



కారేపల్లి, ఆగస్టు 30 : ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న పురాతన శివాలయ అభివృద్ధికి ప్రముఖ బెల్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) గుగులోత్ రవి శ్రీకారం చుట్టారు.గర్భగుడికి ఆనుకుని ఉన్న మండపం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆలయ నిర్వహణ కమిటీ ఈ విషయాన్ని రవి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఆదివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన.. మండప నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు 12 పిల్లర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ ఎర్ర నరసింహారావు, కమిటీ సభ్యుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇమ్మడి తిరుపతిరావు, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రెండో వారంలోనూ తగ్గని ‘ఇరుముడి’ జోరు... రికార్డు స్థాయిలో టికెట్ల అమ్మకాలు!



మాస్ మహారాజా రవితేజ నటించిన తాజా చిత్రం ‘ఇరుముడి’ బాక్సాఫీస్ వద్ద తన పట్టును ఏమాత్రం వదలడం లేదు. దర్శకుడు శివ నిర్వాణ రూపొందించిన ఈ సినిమా, విడుదలైన రెండో వారంలోకి ప్రవేశించినా వసూళ్ల పరంగా అదే దూకుడును ప్రదర్శిస్తోంది. కొత్త సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ, ‘ఇరుముడి’ ప్రేక్షకుల ఆదరణను నిలబెట్టుకుంటూ ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ముఖ్యంగా రెండో శనివారం ఈ చిత్రం నమోదు చేసిన టికెట్ అమ్మకాలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి.రెండో వారంలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. దీనికి నిదర్శనంగా ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో రెండో శనివారం ఒక్కరోజే ఏకంగా 3.76 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. సాధారణంగా రెండో వారంలో సినిమాల జోరు తగ్గుతుంది. కానీ, ‘ఇరుముడి’ మాత్రం వారాంతం మొదలవగానే మళ్లీ పుంజుకుంది. రెండో వారంలో రోజువారీ టికెట్ల అమ్మకాలను పరిశీలిస్తే, శుక్రవారం (8వ రోజు) 3.34 లక్షల టికెట్లు అమ్ముడవగా, శనివారం (9వ రోజు) ఆ సంఖ్య 3.76 లక్షలకు చేరడం సినిమాపై ఉన్న ఆసక్తిని స్పష్టం చేస్తోంది. వారంలో మిగిలిన రోజులతో పోలిస్తే రెండో శనివారమే అత్యధిక టికెట్లు అమ్ముడవడం విశేషం. తెలుగు రాష్ట్రాల్లోని అనేక కేంద్రాల్లో ‘ఇరుముడి’ మంచి ఆక్యుపెన్సీతో ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా వీకెండ్స్‌లో కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు వస్తుండటం సినిమాకు మరింత బలాన్నిస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను అధిగమించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తొలి వారంలో భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా, రెండో వారంలోనూ అదే ఊపును కొనసాగించడం రవితేజ కెరీర్‌కు మరో కలిసొచ్చే అంశం. శనివారం నాటి స్పందనను బట్టి చూస్తే, ఆదివారం కూడా వసూళ్లు భారీ స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఆస్కార్ నుంచి దీపికా పదుకొణెకు

# అరుదైన గుర్తింపు

### ‘యే జవానీ హై దీవానీ’ సినిమాపై ప్రత్యేక పోస్ట్!



బాలీవుడ్ దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, దీపికా పదుకొణె జంటగా నటించిన కల్ట్ హిట్ చిత్రం ‘యే జవానీ హై దీవానీ’ మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ చిత్రంలో దీపికా పదుకొణె పోషించిన ‘నైనా తల్వార్’ పాత్రకు ఆస్కార్ అవార్డులను అందించే ‘ది అకాడమీ’ నుంచి ప్రత్యేక గుర్తింపు లభించింది. అకాడమీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ సినిమాలోని ఒక ప్రత్యేకమైన దృశ్యాన్ని పంచుకుంటూ మీ కళ్ల ముందే ఉన్న అందాన్ని ఆస్వాదించమని నైనా మనకు ఇస్తున్న చిన్న గుర్తు అంటూ క్యాప్షన్ జోడించింది. ఉదయపూర్‌లో అదితి వివాహ వేడుకకు ముందు వచ్చే సూర్యాస్తమయ దృశ్యాన్ని అకాడమీ షేర్ చేసింది. ఈ సీన్‌లో ఎప్పుడూ లైఫ్‌లో పరిగెత్తే బన్నీతో (రణ్‌బీర్ కపూర్), క్షణాన్ని ఆస్వాదించాలని, ప్రతిదీ అనుభవించడం సాధ్యం కాదని, కొన్నిసార్లు ఉన్న చోటే సంతోషంగా గడపడం ముఖ్యమని నైనా వివరిస్తుంది. సినిమాలోని ఈ భావోద్వేగ సన్నివేశం ప్రేక్షకుల మనసులను ఎంతగానో హత్తుకుంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. “ఈ సినిమా నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకమే,” అని ఒక అభిమాని అనగా, మరొకరు “ఎన్ని సినిమాలు చూసినా, ‘యే జవానీ హై దీవానీ’ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. ఏడాదికిసారైనా ఈ సినిమా చూస్తాను, ఇది ఇంటికి వెళ్లిన అనుభూతిని ఇస్తుంది,” అని పేర్కొన్నారు. 2013లో విడుదలైన ఈ చిత్రానికి రణ్‌బీర్, దీపికాలతో పాటు ఆదిత్య రాయ్ కపూర్, కల్కి కోచ్లిన్ నటన, ప్రీతమ్ సంగీతం అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఇప్పటికీ ఈ సినిమాకు కోట్లాది మంది అభిమానులున్నారు.

### తెలుగు ఓటీటీలో

# జీ5 దూకుడు..

### భారీ చిత్రాలు, ఒరిజినల్స్‌తో కంటెంట్ జాతర

ప్రముఖ ఓటీటీ వేదిక జీ5, తెలుగు వినోద రంగంలో తన స్థానాన్ని మరింత పదిలం చేసుకునేందుకు భారీ ప్రణాళికతో ముందుకొచ్చింది. సరికొత్త ఒరిజినల్స్, బ్లాక్‌బస్టర్ చిత్రాలు, స్టార్ హీరోల ప్రాజెక్టులతో కూడిన మెగా కంటెంట్ లైనప్‌ను ప్రకటించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తించింది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి, సాంస్కృతిక మూలాలకు పెద్దపీట వేస్తూ, విభిన్నమైన కథలతో వినోదాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ లైనప్‌ను రూపొందించినట్లు జీ5 స్పష్టం చేసింది. ఈ కంటెంట్ జాతరకు మరింత బలాన్ని చేకూరుస్తూ, తెలుగు సినీ పరిశ్రమలోని పలు దిగ్గజ నిర్మాణ సంస్థలతో జీ5 వ్యూహాత్మక భాగస్వామ్యాలను కుదుర్చుకుంది. వైజయంతీ మూవీస్, సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర (ఎస్వీసీసీ), ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్, షైన్ స్క్రీన్స్, వృద్ధి సినిమాస్ వంటి ప్రముఖ బ్యానర్‌లతో కలిసి పనిచేయనుండటం ఈ లైనప్‌పై అంచనాలను రెట్టింపు చేస్తోంది. ప్రస్తుతం ప్రేక్షకులు



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పలు భారీ చిత్రాలు ఈ లైనప్‌లో ఉండటం విశేషం. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఎన్‌బీకే111’, అక్కినేని నాగచైతన్య హీరోగా కార్తీక్ వర్మ దండు రూపొందిస్తున్న ‘వృషకర్మ’ చిత్రాలు జీ5 ద్వారా ప్రేక్షకులను పలకరించనున్నాయి. వీటితో పాటు, విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ‘జనవరి 12 విడుదల’, అఖిల్ అక్కినేని హీరోగా మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కించిన ‘లెనిన్’, అల్లరి నరేశ్ నటిస్తున్న ‘కనకదుర్గ’ వంటి క్రేజీ ప్రాజెక్టులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఇవే కాకుండా ‘జననాయకుడు’, ‘హేయ్’, ‘డిమాంటీ కాలనీ 2’, ‘ఏ క్వీన్’, ‘వీరప్పన్ 2’ వంటి డబ్బింగ్ చిత్రాలు కూడా వినోదాన్ని పంచనున్నాయి. సినిమాలతో పాటు ఒరిజినల్ కంటెంట్‌కు కూడా జీ5 పెద్దపీట వేస్తోంది. విలక్షణ నటి నివేదా థామస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘శ్రీమతి’ అనే ఒరిజినల్ సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. అలాగే భరత్ నివాస్, శివాజీ రాజా కీలక పాత్రల్లో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ ‘పంచనామా’ కూడా ఉత్కంఠను రేకెత్తించనుంది. వీటికి తోడు, గతంలో ఎంతో ఆదరణ పొందిన సెలబ్రిటీ గేమ్ షో ‘జయమ్ము నిశ్చయమ్మురా’.. ఈసారి జగపతి బాబు హోస్ట్‌గా ‘జయమ్ము నిశ్చయమ్మురా 2’ పేరుతో పునఃప్రారంభం కానుండటం మరో విశేషం. ఈ భారీ లైనప్ ఆవిష్కరణ సందర్భంగా జీ5 తెలుగు, తమిళం, మలయాళం బిజినెస్ హెడ్ లాయిడ్ సి. జేవియర్ మాట్లాడుతూ, “తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ కొత్తదనాన్ని, తమ మనసుకు దగ్గరయ్యే కథలను ఆదరిస్తారు. వారి అభిరుచిని అర్థం చేసుకుని, భావోద్వేగాలకు కనెక్ట్ అయ్యేలా ఈ కొత్త కంటెంట్ లైనప్‌ను రూపొందించాం. ‘జయమ్ము నిశ్చయమ్మురా 2’ వంటి పాపులర్ షోలతో పాటు ‘శ్రీమతి’, ‘పంచనామా’ లాంటి విభిన్నమైన ఒరిజినల్స్ అందిస్తున్నాం. ప్రతి కథలోనూ ప్రత్యేకత ఉండేలా, ధైర్యంగా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ లైనప్‌ను తీర్చిదిద్దాం” అని వివరించారు. సినిమాలు, సిరీస్‌లకే పరిమితం కాకుండా, వినోదంలో సరికొత్త ప్రయోగాలకు జీ5 శ్రీకారం చుట్టింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత స్టోరీ టెల్లింగ్‌తో ‘గరుడ’, ‘విక్రమ్ బేతాళ్’, ‘శివ్ సతి’, ‘చంద్రకాంత’, ‘తిరుపతి బాలాజీ’, ‘నర్మద’, ‘రామ్ ఆంజనేయ యుద్ధ్’ వంటి సరికొత్త కథనాలను అందించనుంది. అలాగే పిల్లల కోసం ‘బార్బరీక్’, ‘కుండక మండక్క’ వంటి ప్రత్యేక కంటెంట్‌ను, క్రీడాభిమానుల కోసం ఫిఫా, బుండెస్ లీగా, కోపా ఇటాలియా, ఐఎల్‌టీ20 వంటి లైవ్ స్పోర్ట్స్ ఈవెంట్లను కూడా అందిస్తూ తన పోర్ట్‌ఫోలియోను విస్తృతం చేసింది. మొత్తం మీద, ఈ భారీ లైనప్‌తో జీ5 తెలుగు ఓటీటీ మార్కెట్లో తన పోటీని మరో స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, విభిన్న అభిరుచులున్న ప్రేక్షకులందరినీ ఆకట్టుకోవాలనే స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

# నలభై రాగానే రాజకీయాల్లోకి..



‘రాజమండ్రి రోజ్ మిల్క్’ సినిమాతో వెండితెరకు పరిచయమైన మలయాళీ బ్యూటీ అనంతిక సనీల్ కుమార్. ఆ సినిమా నిరాశపరిచినా నటనతో మంచి గుర్తింపును తెచ్చుకున్నది. మ్యాడ్ మూవీతో మరో అడుగుముందుకేసిన ఈ ముద్దుగుమ్మ ‘8 వసంతాలు’ సినిమాలో నటన, అందంతో యూత్‌ను కట్టిపడేసింది. ఈ సినిమాలో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచి విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. ప్రస్తుతం సుమంత్ ప్రభాస్‌తో ‘రోమాంచకం’లో జోడి కట్టిన ఈ కేరళం కుట్టి పంచుకున్న కార్వాన్ కబుర్లు ఇవి.. నాకు రాజకీయాలంటే ఆసక్తి. అందులో భాగంగానే మన చట్టాల గురించి పూర్తి అవగాహన ఉండాలన్న ఆలోచనతో లా చదువుతున్నాను. ఇప్పటికైతే సినిమాలు నా చదువుకు ఎప్పుడూ ఆటకంగా నిలవలేదు. నాకు 40 ఏండ్లు వచ్చాక కచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్తా. మాది కేరళం. చిన్నప్పటినుంచి క్లాసికల్ డ్యాన్స్, కరాటే, కళరియపట్టు, కత్తిసాము లాంటి విద్యల్లో ప్రావీణ్యం సంపాదించాను. కేరళం సంప్రదాయ వాద్యమైన చెండా వాయించడంలోనూ పట్టుంది. నా ఎదుగుదలకు ఉపయోగపడే వాటితోపాటు ఆత్మరక్షణ విద్యలూ నేర్చుకున్నాను. ‘8 వసంతాలు’లో ఈ కళలు నాకు చాలా ఉపయోగ పడ్డాయి. నాకు సినిమాల్లోకి రావాలనే ఆసక్తి లేదు. అనుకోకుండా వచ్చాను. కరోనా సమయంలో ఖాళీగా ఉండటంతో ఓ మలయాళి సినిమాలోకి డ్యాన్సర్‌గా వెళ్లాను. ఆ సినిమా డీఓపీ నన్ను చూసి హిరోయిన్‌గా ట్రై చేయమని సలహా ఇచ్చాడు. ఇంట్లోవాళ్లకు ఇష్టంలేకున్నా నన్ను నేను నిరూపించుకునేందుకు మాత్రమే సినిమాలకు ఆడిషన్లు ఇవ్వడం మొదలు పెట్టాను. ఇప్పటివరకు ఇంటిమేట్ సీన్స్ చేయలేదు. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే మనసుకు కష్టంగా అనిపిస్తుంది. నిజంగా కథ డిమాండ్ చేస్తే మాత్రం కొంత లిమిటేషన్‌తో ఈ సీన్లను చేయడానికి సిద్ధంగా ఉంటాను. రోమాంచకం సినిమాను ఈ జనరేషన్ తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సుమంత్ మంచి నటుడు. నాలాగే సోషల్ మీడియాలో తెగ పోస్టులు పెడుతుంటాడు. ప్లస్ 2 చదువుతూనే ఇంటికీ, షూటింగ్ లొకేషన్లకు చక్కర్లు కొట్టేదాన్ని. మొదట్లో చేసిన సినిమాలు విడుదల కాకపోవడం, ఆ తర్వాత చేసినవి అంతగా గుర్తింపు ఇవ్వకపోవడంతో నిరాశపడ్డాను. ఇక సినిమాలు చేయకూడదనుకున్నా. కానీ ‘8 వసంతాలు’ కథ విని ఒకే చెప్పాను. సినిమాల్లో హిట్, ఫ్లాప్ రెండింటినీ ఒకే విధంగా పరిగణిస్తాను. 2023లో కోలీవుడ్‌లో విక్రమ్ ప్రభుతో రైడ్, రజనీకాంత్ లాల్‌సలామ్‌లో నటించాను. అవి ఆశించిన విజయాన్ని అందుకోలేక పోవడంతో కాస్త నిరాశకు గురయ్యాను.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ‘కొరియన్ కనకరాజు’..



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం ‘కొరియన్ కనకరాజు’ ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో మంచి విజయం సాధించిన ఈ హారర్ కామెడీ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. సెప్టెంబర్ 4 నుంచి ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంటుందని చిత్ర బృందం ప్రకటించింది.
మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించింది. ఆగస్టు 7న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ప్రేక్షకులనుంచి మంచి స్పందన రాబట్టుకుంది. ఇప్పుడు థియేటర్లలో విడుదలైన సుమారు నాలుగు వారాలకే ఈ సినిమా ఓటీటీలోకి వస్తుండటం గమనార్హం. సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. ఇక కథ విషయానికి వస్తే, అనంతపురంకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజనలు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ముక్కుసూటి మనస్తత్వం, కోపం ఎక్కువ. కొరియా వెళ్లాలనే కలతో ఉన్న చైత్ర (రితికా నాయక్) అనే యువతితో ప్రేమలో పడతాడు. ఈ క్రమంలో కొరియా నుంచి వచ్చిన ఒక వస్తువు ద్వారా ఓ విచిత్రమైన ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీంతో అతని ప్రవర్తనలో అనూహ్య మార్పులు వస్తాయి. ఈ సమస్య నుంచి బయటపడటానికి స్నేహితులతో కలిసి కొరియాకు వెళతాడు. అసలు ఆ ఆత్మ ఎవరు? కనకరాజును ఎందుకు ఆవహించింది? చివరికి అతను తన ప్రేమను గెలిపించుకున్నాడా? అనే అంశాలతో ఈ సినిమా వినోదాత్మకంగా సాగుతుంది. థియేటర్లలో ఈ హారర్ కామెడీని చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో చూసి ఎంజాయ్ చేయవచ్చు.


## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి

# ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎం జీ ఎం హాస్పిటల్ హెలిప్యాడ్ వద్ద స్వయంగా ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి వారికి ఆత్మీయంగా ఆహ్వానం పలకడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా వారికి శ్రీకాళహస్తీశ్వర స్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల పవిత్ర తీర్థ ప్రసాదాలను అందజేశాను. ఆ స్వామి వారి ఆశీస్సులు ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను. ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధ రెడ్డి. అక్కడినుండి కళ్యాణ మండపం కి వచ్చి టిడిపి సీనియర్ నాయకుడు పి ఆర్ మోహన్ సతీమణి ఇందిర పెళ్లికూతురు డింపుల్ పెళ్ళికొడుకు రాజేష్ నూతన వధూ వరుణ్ణి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించినారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుజ్జుల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి వినతిపత్రం అందజేసిన దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరిస్తూ ముఖ్యమంత్రి కి వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రంలో ప్రధానంగా గుడ్డేరు కాలువపై నూతనంగా నిర్మించదలచిన వంతెన (బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ట్రాఫిక్ సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు పట్టణ రవాణా వ్యవస్థ మరింత సులభతరం అవుతుందని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూడనున్నట్లు సానుకూలంగా స్పందించారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని

# కలిసిన బిజెపి కోలా ఆనంద్



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) తొట్టంబేడు మండలంలోని సీ.సీ.ఎన్ కన్వెన్షన్ హాల్ నందు జరిగిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి.ఆర్. మోహన్ కుమార్తె వివాహ శుభాకార్యానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ని హెలిపాడ్ వద్ద కలిసిన బిజెపి కోలా ఆనంద్ కుమార్ స్వాగతం మరియు వీడ్కోలు పలకడం జరిగింది అనంతరం నారా చంద్రబాబు నాయుడు తో కలిసి వివాహ వేడుకకు హాజరై,నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మియాపూర్ నాగార్జున ఎంక్లేవ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం

### - లయన్ అన్నెం కోటిరెడ్డి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) నాగార్జున ఎంక్లేవ్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సనత్‌నగర్, నాగార్జున ఎంక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని రోడ్డు పక్కన గ్రీనరీని పెంపొందించేందుకు ఐదేళ్ల వయస్సు కలిగిన మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని లయన్ అన్నెం కోటిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ పి.ఎం. పాత్ర, శ్రీ డి.జి.ఎం. (ఆంధ్రా బ్యాంక్), శ్రీ నాదెళ్ల ప్రేమానంద్, కాలనీ అధ్యక్షుడు శ్రీ కాట్రగడ్డ సత్యం, శ్రీ రాంప్రసాద్, శ్రీ మధు, శ్రీ కృష్ణారెడ్డి తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. "పచ్చదనం పెంపొందిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికులను ఆకట్టుకుంది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సర్పంచ్ శ్రీలత

### బీఆర్ఎస్ ములుగు అధ్యక్షులు లక్ష్మణ్ బాబు.

### నిండు నూరేళ్లు ఆశీర్వదించిన సర్పంచ్ దంపతులు



ఏటూరునాగారం(ప్రశ్నన్యూస్) స్థానిక అరుణ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వధూవరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని దీవించారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, కర్ర రవీందర్, గండేపల్లి నర్సయ్య, అంతటి నాగరాజు, మొండయ్య, బట్టు రమేష్, చిప్ప అశోక్, కొమెర రమేష్ వావిలాల కిషోర్ తో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష కేంద్రాల తనిఖీ

### పకడ్బందీగా నీట్ పరీక్షను నిర్వహించాలని

### జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నీట్ పీజీ ప్రవేశ పరీక్షలు జరిగాయి. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ మేడిపల్లి మండలాలలోని నీట్ పరీక్ష కేంద్రాలైన సి ఎల్ ఓ ఎస్ డిజిటల్ ప్రవేట్ లిమిటెడ్ నాగోల్, సూర్య టెక్నాలజీ ఫిర్జాదిగూడ మేడిపల్లి కాలేజీ లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష నిర్వహణను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. కాలేజీలో వివిధ విభాగాలలో నిర్వహిస్తున్న నీట్ పరీక్షను పరిశీలించారు. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న సెంటర్లను తనిఖీ చేశారు. పరీక్ష నిర్వాహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారుఈ కార్యక్రమంలో మేడిపల్లి తహసిల్దార్ సూపరింటెండెంట్లు సంబంధిత,అధికారులు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యాడారంలో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



మేడ్చల్( ప్రశ్న న్యూస్) మేడ్చల్ నియోజకవర్గం, అలియాబాద్ మున్సిపాలిటీ 12వ వార్డు, యాడారం గ్రామంలో మద్దుల నారం రెడ్డి - లక్ష్మి గారు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంతం శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ పాల్గొని గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగోళ్ళ హనుమాన్ దాస్ , సామల జశ్వంత్ రెడ్డి , ఏఎంసీ డైరెక్టర్ తుంకి బిక్షపతి మాజీ సర్పంచ్ యంజాల సుజాత రెడ్డి , కాంగ్రెస్ నాయకులు అబ్బాగౌని భాస్కర్ గౌడ్ , కొమ్ము వినోద్ , చిటుకుల రాజశేఖర్ రెడ్డి , పిట్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఫ్రెండ్స్ గ్రూప్

### బాధిత కుటుంబాలకు క్వింటాల్ సన్న బియ్యం అందజేత



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) జగదేవ్‌పూర్: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ ఫ్రెండ్స్ గ్రూప్ యువత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన మావురపు సత్తయ్య వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. అదేవిధంగా పలుగుగడ్డ గ్రామానికి చెందిన చెక్కల గంగమ్మ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పలుగుగడ్డ, మాందాపూర్ గ్రామాలకు చెందిన ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఇరు బాధిత కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి క్వింటాల్ (100 కిలోల) సన్న బియ్యం చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి తమ గ్రూప్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మనం సంపాదించిన దాంట్లో లేని తృప్తి, ఆనందం ఇతరులకు సేవ చేయడంలోనే లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షుడు నర్ర నర్సింలు, లింగాల గణేష్తో పాటు సభ్యులు నర్ర విజయ్, నర్ర కృష్ణ, పిట్టల అంజయ్య, నర్ర నరేష్, లింగాల రమేష్, లింగాల సంపత్, నర్ర నవీన్, లింగాల నరేష్, నర్ర శశిధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు నడ్డి విరుస్తున్న కాంగ్రెస్-బీజేపీ

### యూరియా యాప్ పేరుతో రైతులకు తిప్పలు

### మూడు ఫేసుల కరెంట్ ఎక్కడ.?

### "గ్రామంలో నెట్‌వర్క్ ఉండదు.. రైతుకు స్మార్ట్‌ఫోన్ ఉండదు.. సర్వర్ పనిచేయదు"

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రైతులను కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కలిసి మోసం చేస్తున్నాయని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాచారం కనకయ్య ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "రైతు పొలంలో ఉండాలి కానీ.. యాప్‌లో ఉండకూడదు. రైతుకు ఎరువు అందించాల్సిన ప్రభుత్వం యాప్ చూపించి చేతులు దులుపుకుంటే ఎలా?" అంటూ ప్రశ్నించారు.

### యూరియా కోసం రైతును ఎందుకు తిప్పుతున్నారు?

యూరియా కోసం రైతులు యాప్‌లో బుకింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి రావడం సరికాదని కనకయ్య అన్నారు. యాప్‌లో బుక్ చేసుకున్న తర్వాత ఎరువుల కోసం వెళ్లినప్పుడు కూడా "యూరియా స్టాక్ లేదు" అని చెప్పే పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఇది రైతులకు అనుకూలమైన విధానం కాదని అన్నారు. ప్రభుత్వం మాత్రం యాప్ ద్వారా యూరియా సరఫరాలో పారదర్శకత పెంచి, సరఫరాను మెరుగుపరచే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతోందని ఆయన పేర్కొన్నారు. "గ్రామాల్లో నెట్‌వర్క్ ఉండదు.. రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు ఉండకపోవచ్చు.. సర్వర్ పనిచేయకపోవచ్చు.. కానీ ప్రభుత్వం మాత్రం యాప్‌లో బుక్ చేసుకోమంటోంది. రైతు వ్యవసాయం చేయాలా? యాప్‌తో యుద్ధం చేయాలా?" అని కనకయ్య ప్రశ్నించారు. యూరియా అవసరమైన సమయంలో రైతులకు నేరుగా అందుబాటులో ఉంచకుండా డిజిటల్ ప్రక్రియల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. "రైతు చేతిలో ఎరువుల బస్తా ఉండాలి.. యాప్‌లో బుకింగ్ స్లాట్ కాదు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### మూడు ఫేసుల కరెంట్ ఎక్కడ?

వ్యవసాయానికి నాణ్యమైన మూడు ఫేసుల విద్యుత్‌ను అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని కనకయ్య ఆరోపించారు. రైతులకు పగటిపూటే విద్యుత్ అందించాలని, పంటలకు నీరు అందించే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. "రైతుకు పగలు కరెంట్ కావాలి. పంటకు నీళ్లు పెట్టే సమయానికి విద్యుత్ ఉండాలి. కానీ కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని ప్రశ్నించారు. మూడు ఫేసుల విద్యుత్ కోసం రైతులు రాత్రివేళ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రైతుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో యూరియా, నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని దాచారం కనకయ్య డిమాండ్ చేశారు.

## అమ్మవారి అలంకరణకు..

# స్వర్ణ జడ కానుక

### రూ.11 లక్షల విలువైన బంగారు ఆభరణం సమర్పణ



విజయవాడ (ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కనకదుర్గమ్మ అమ్మవారి అలంకరణకు మరో అపురూప ఆభరణం చేరింది. అమ్మవారి సేవలో భాగంగా ఆలయ పాలక మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) కుటుంబం తరఫున రూ. 11 లక్షల విలువైన బంగారు జడను తయారు చేయించి ఆదివారం దేవస్థానానికి సమర్పించారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు రాజగోపురం ప్రాంగణంలోని కళావేదిక వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ బంగారు జడను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్, అర్చకులకు అందజేశారు. అనంతరం చైర్మన్ కుటుంబ సభ్యులు, ఈవో, ఆలయ సిబ్బంది, అర్చక స్వాములు కలిసి ఆ స్వర్ణాభరణాన్ని భక్తిశ్రద్ధలతో ప్రధాన ఆలయానికి తీసుకెళ్లారు. అమ్మవారి అలంకరణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ బంగారు జడ సుమారు 119.500 గ్రాముల బరువు కలిగి ఉంది. దీని మొత్తం విలువ రూ. 11 లక్షలుగా ఆలయ అధికారులు తెలిపారు. సాంప్రదాయ రూపకల్పనలో నైపుణ్యంతో తీర్చిదిద్దిన ఈ ఆభరణంలో లక్ష్మీదేవి రూపంతో పాటు ఇతర దైవిక ఆకృతులను పొందుపరిచారు. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా అధికారుల సమక్షంలో అర్చకులకు స్వర్ణ జడను సమర్పించారు. అమ్మవారి సేవకు బంగారు ఆభరణాన్ని సమర్పించిన సందర్భంగా ఆలయ సిబ్బంది, అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ కుటుంబ సభ్యులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చక స్వాములు పాల్గొన్నారు.

# సీమ పల్లెలకు.. అభివృద్ధి బాటలు

- రూ.8,022 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు
- 23 వేలకుపైగా రోడ్లు, 5,238 కి.మీ. పనులు పూర్తి
- ఫార్మ్ పాండ్లతో 50 వేల ఎకరాలు అదనంగా సాగులోకి
- 62 వేల ఎకరాల్లో ఉద్యాన సాగు.. 28 వేల మంది రైతులకు లబ్ధి
- రూ.2,782 కోట్లతో జేజేఎం-అమరజీవి జలధార పనులు








అమరావతి (ప్రశ్న న్యూస్) కరవు, వలసలు, తాగునీటి సమస్యలతో వెనుకబడిన రాయలసీమ పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టితో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల పరిధిలో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గడచిన రెండేళ్లలో సుమారు రూ.8,022 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొంది.జల సంరక్షణ, గ్రామీణ రహదారులు, తాగునీటి సరఫరా, ఉద్యాన సాగు, పాడి పరిశ్రమ, పారిశుధ్యం, అటవీ సంరక్షణ వంటి రంగాల్లో చేపట్టిన పనులతో గ్రామీణ ముఖచిత్రం మారుతోందని తెలిపింది.బీటలు వారిన నేలలకు నీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ఫార్మ్ పాండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాయలసీమలో తొలి దశగా 40,837 పంట కుంటలు నిర్మించాలన్న లక్ష్యాన్ని అధిగమించి 41,614 కుంటలు నిర్మించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం రూ.166.46 కోట్లు వెచ్చించింది.రెండో దశలో మరో 29,902 ఫార్మ్ పాండ్లు మంజూరై వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి. రెండు దశల కుంటల నిర్మాణంతో రాయలసీమలో అదనంగా 50 వేల ఎకరాలకు పైగా భూమి సాగులోకి వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతులకు సుమారు రూ.55 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరినట్లు తెలిపింది.పాడి రైతులకు అండగా వ్యక్తిగత పశువుల షెడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. రెండేళ్లలో సుమారు 15 వేల మినీ గోకులాలు నిర్మించగా, మరో 3 వేల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. తొలి దశలోనే లక్ష్యాన్ని అధిగమించి 9,708 గోకులాలు రైతులకు అందుబాటులోకి తెచ్చారు.పల్లెపండుగ, పల్లెపండుగ-2.0 కార్యక్రమాల ద్వారా మినీ గోకులాల నిర్మాణానికి రూ.170 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది.రాయలసీమను ఉద్యాన పంటల హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం నిధులను వినియోగిస్తున్నారు. రెండు దశల్లో సుమారు 62 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, పూలు, మునగ తదితర ఉద్యాన పంటల సాగుకు రూ.200 కోట్లకు పైగా ఖర్చు చేశారు.ఈ కార్యక్రమం ద్వారా 28 వేల మందికి పైగా రైతులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఎకరాకు ఏటా రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపింది.సరిహద్దు జిల్లాల్లో అడవి ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు పలమనేరు నియోజకవర్గంలోని ముసలమడుగులో కుంకీ ఏనుగుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కుంకీలు దాదాపు 15 ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.కుంకీల రాకతో మానవ-ఏనుగుల ఘర్షణలు 75 శాతం, పంట నష్టం 50 శాతం తగ్గినట్లు ప్రభుత్వం పేర్కొంది.రాయలసీమ పట్టణాల్లో నగర వనాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు.

రూ.26 కోట్లతో 13 నగర వనాల నిర్మాణం పూర్తయింది. కళ్యాణదుర్గం, రాయదుర్గం, పుట్టపర్తి, బద్వేల్, తిరుపతి, కోడూరు, డోన్ తదితర ప్రాంతాల్లో నగర వనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.రాయలసీమ తాగునీటి సమస్య పరిష్కారానికి జేజేఎం--అమరజీవి జలధార పథకాల పనులు కొనసాగుతున్నాయి. మొత్తం రూ.2,782 కోట్ల పనులు పురోగతిలో ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంది.గతంలో అసంపూర్తిగా నిలిచిన పులివెందుల మల్టీ విలేజ్ వాటర్ స్కీమ్‌ను రూ.280 కోట్లతో పూర్తి చేస్తున్నారు. డోన్ మల్టీ విలేజ్ స్కీమ్‌కు రూ.132 కోట్లతో పనులు చేపట్టగా.. పూర్తయితే సుమారు 3.5 లక్షల మందికి తాగునీరు అందనుంది.చిత్తూరు మెగా వాటర్ గ్రిడ్‌కు రూ.2,370 కోట్లతో శ్రీకారం చుట్టారు. ఇది పూర్తయితే రానున్న 30 ఏళ్లలో సుమారు 25 లక్షల మందికి పైగా ప్రజలకు తాగునీటి భరోసా లభించనుందని ప్రభుత్వం తెలిపింది.రాయలసీమలో గ్రామీణ రహదారుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించారు. పల్లెపండుగ, పల్లెపండుగ-2.0, సాస్కీ తదితర పథకాల కింద రూ.4,523 కోట్ల అంచనా వ్యయంతో 23 వేలకుపైగా రోడ్డు పనులు చేపట్టారు.మొత్తంగా 4,630 కి.మీ. బీటీ, 3,067 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. అందులో 2,582 కి.మీ. బీటీ, 2,655 కి.మీ. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మిగిలిన పనులు వివిధ



దశల్లో కొనసాగుతున్నాయి.వైఎస్సార్ కడప జిల్లాకు రూ.876 కోట్లు, అనంతపురానికి రూ.691 కోట్లు, తిరుపతికి రూ.521 కోట్లు, అన్నమయ్యకు రూ.518 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాకు రూ.483 కోట్లు కేటాయించినట్లు పేర్కొంది.రోడ్ల నిర్మాణంతో పాటు గ్రామీణ పారిశుధ్యంపై కూడా దృష్టి సారించారు. పలు గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. 50 వేలకుపైగా వ్యక్తిగత కంపోస్ట్ గుంతలు, భూగర్భ జలాల రీచార్జ్‌కు ఉపయోగపడే 28 వేలకుపైగా ఇంకుడు గుంతలు నిర్మించినట్లు ప్రభుత్వం తెలిపింది.పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించిన వెంటనే 13,326 పంచాయతీల్లో ఏకకాలంలో గ్రామసభలు నిర్వహించడం ద్వారా గ్రామీణ అవసరాలపై దృష్టి సారించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఫార్మ్ పాండ్ల రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పుడిచర్లను వేదికగా ఎంచుకుంది.రాయలసీమలో గ్రామీణ మౌలిక వసతులు, జల సంరక్షణ, వ్యవసాయం, తాగునీరు, పాడి పరిశ్రమ, పచ్చదనం, ఉపాధి వంటి రంగాల్లో చేపడుతున్న పనులతో పల్లెల రూపురేఖలు మారుతున్నాయని ప్రభుత్వం తెలిపింది. కేంద్ర సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించింది.

# ఏఐ టెక్నాలజీతో జెండావందనం

- కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన 13 ఏళ్ల బాల మేధావి శ్రీ సృష్టి సాయి సాంకేతిక ప్రతిభపై మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో మొబైల్ ద్వారా నియంత్రించే వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ (జెండా వందనం) సిస్టమ్‌ను రూపొందించిన సృష్టి సాయిని ఆయన అభినందించారు. చిన్న వయసులోనే సాంకేతికతపై పట్టు సాధించి అద్భుత ఆవిష్కరణ చేసిన ఆ బాలుడు ఎందరికో ఆదర్శమని కొనియాడారు. ఈ విషయంపై ఈటల రాజేందర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. “శ్రీ సృష్టి సాయి ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభ అభినందనీయం. ఈ పిన్న వయసులోనే అతని ఆవిష్కరణ గర్వకారణం” అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ‘డిజిటల్ ఇండియా’ దార్శనికతతో దేశం ముందుకు దూసుకెళ్తోందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే సృష్టి సాయి వంటి యువ ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారని అభిప్రాయపడ్డారు. మోదీ ప్రోత్సాహంతో భారత్ నేడు కేవలం టెక్నాలజీని వినియోగించే దేశంగా కాకుండా, కొత్త టెక్నాలజీలను సృష్టించే గ్లోబల్ హబ్‌గా మారుతోందని ఈటల అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి విద్యార్థులు సంప్రదాయ చదువులతో పాటు ఏఐ, కోడింగ్ వంటి ఆధునిక నైపుణ్యాలను అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శ్రీ సృష్టి సాయి భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఆవిష్కరణలు చేయాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తన పోస్టులో ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# ‘నీట్ ‘గా ముగిసిన ఎగ్జామ్

- రంగారెడ్డిలో మద్యం తాగి పరీక్షకు వచ్చిన స్టూడెంట్
- గుర్తించి వెనక్కి పంపిన అధికారులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 2,73,183 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1,300 కేంద్రాల్లో ఎగ్జామ్ నిర్వహించారు. ఇక తెలంగాణలో 17,627 మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగానూ 56 కేంద్రాల్లో నీట్ ప్రశాంతంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా శేరిగూడలో ఓ విద్యార్థి మద్యం తాగి పరీక్ష రాసేందుకు వచ్చాడు. వివరాల్లోకి వెళితే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్షా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అనే విద్యార్థి సెక్యూరిటీ తనిఖీలను తప్పించుకుని నేరుగా పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాడు. లోపల అతని ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం, అతని నుంచి మద్యం వాసన రావడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పరీక్ష రాసేందుకు అనర్హుడని నిర్ధారించుకున్న సిబ్బంది అతడిని హాల్ నుంచి బయటకు పంపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రిజ్వాన్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా, అతను మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మిగతా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

# ఉజ్బెకిస్థాన్‌లో యోగా సెషన్


- ఆసక్తిగా వీక్షించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉజ్బెకిస్థాన్ యోగా ఫెడరేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 52 మంది యోగా సాధకులు ప్రదర్శించిన ఆసనాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమ ప్రాంగణంలో కలియదిరుగుతూ సాధకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ “ఈ రోజు మీరు అద్భుతమైన యోగాను ప్రదర్శించారు. ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్న నా మిత్రుడు, దేశాధ్యక్షుడికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను” అని అన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాధకులతో కలిసి ఆయన గ్రూప్ ఫోటో దిగారు. ఈ యోగా సెషన్‌కు సంబంధించిన వీడియోను కూడా ప్రధాని పంచుకున్నారు.అంతకుముందు శనివారం తాష్కెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయేవ్ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి అధ్యక్ష భవనం వరకు ఇరువురు నేతలు కలిసి ప్రయాణించడం వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను తెలియజేసింది. అనంతరం ఇద్దరి మధ్య విందు సమావేశం జరిగింది. ఆదివారం ఇరువురు నేతలు ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, విద్య, ఇంధనం వంటి కీలక రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ఈ చర్చలు జరగనున్నాయి. ప్రధానిగా మోదీ ఉజ్బెకిస్థాన్‌లో పర్యటించడం ఇది నాలుగోసారి. గతంలో 2015, 2016, 2022లో ఆయన ఇక్కడ పర్యటించారు. తాజా పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేస్తుందని భావిస్తున్నారు. ఉజ్బెకిస్థాన్ పర్యటన ముగించుకుని, కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌లో జరగనున్న 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బయలుదేరి వెళతారు.

# జిహెచ్ఎంసి పరిధిలో అక్రమ కట్టడాలకు కాలం చెల్లినట్లే

- అక్రమ కట్టడాలపై కమిషనర్ సీరియస్, జోరుగా నోటీసులు
- నోటీసులకు సమాధానం ఇవ్వని అక్రమ కట్టడాలు కూల్చివేతలకు రంగం సిద్ధం
- ఉన్నతాధికారుల మార్పుపై ప్రశంస జల్లులు






మేడ్చల్ (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసిలో పరిధిలో అక్రమ కట్టడాలకు కాలం చెల్లినట్లేనని అనిపిస్తుంది. అనుమతులు లేకుండా నిర్మించినా జి ప్లస్ టు అనుమతులు పొంది అదనంగా మరో అంతస్తులు నిర్మించిన జిహెచ్ఎంసి అధికారులు కొరడా విధిస్తున్నారు. మొదట నోటీసులు ఇచ్చి నోటీసులకు సమాధానం రాకపోతే అక్రమ భవనాన్ని కూల్చి వేయడానికి కూడా జిహెచ్ఎంసి అధికారులు వెనుకాడడం లేదు. ఈ మార్పుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### జిహెచ్ఎంసి లో విలీనం అయ్యాక మార్పు

మున్సిపల్ పరిధి నుండి జిహెచ్ఎంసి లో విలీనం అయ్యాక మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. మున్సిపల్ హయాంలో విచ్చలవిడిగా వెలిసిన అక్రమ కట్టడాలకు జిహెచ్ఎంసి లోకి విలీనమయ్యాక అధికారులు అక్రమ కట్టడాల భరతం పడుతున్నారు. మున్సిపల్ హయాంలో అక్రమ కట్టడాలకు నోటీసులు ఇచ్చిన అక్రమ కట్టడాల నిర్మాణదారులు డోంట్ కేర్ అనేవారు.. కానీ జిహెచ్ఎంసిలో విలీనమయ్యాక ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మార్పును స్వాగతిస్తున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

### గుండ్ల పోచంపల్లి లో అక్రమ కట్టడాలపై కోరడ

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో అక్రమ కట్టడాలపై జిహెచ్ఎంసి అధికారులు కొరడా విధిస్తున్నారు. ఇటీవలే జిహెచ్ఎంసి డివిజన్ కార్యాలయ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన కమర్షియల్ భవనాన్ని జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. అంతేకాకుండా ఆ భవన యజమాని పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు సైతం చేశారు. ఇదేవిధంగా గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని కండ్ల కోయలో అనుమతులు లేకుండా నిర్మించిన భారీ భవనాన్ని సీజ్ చేశారు. జిహెచ్ఎంసి యాక్ట్ 1955 ప్రకారం సీజ్ చేశారు. ఇదేవిధంగా గుండ్ల పోచంపల్లి పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు కు నోటీసులో అందజేశారు. దీంతో షెడ్డు నిర్మాణ పనులు ఆగిపోయాయి. అక్రమ కట్టడాలపై జిహెచ్ఎంసి అధికారులు కొరడా విధిస్తుండడంతో వారిపై ప్రజల్లో నమ్మకం ఏర్పడుతుంది. గతంలో నోటీసులు ఇచ్చిన భయపడని అక్రమ నిర్మాణదారులు.. ఇప్పుడు అక్రమంగా భవనాలను నిర్మించాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఇదేవిధంగా మేడ్చల్ తో పాటు గుండ్ల పోచంపల్లి, కిస్టాపూర్ పూడూరు డివిజన్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు జిహెచ్ఎంసి అధికారులను కోరుతున్నారు.

### 75 గజాలలో నిర్మించే భవనాలకు సైతం నిబంధనలు కఠిన తరం

75 గజాలలో నిర్మించే భవనాలకు సైతం నిబంధనలను కఠిన తరం చేశారు. 7 మీటర్లకు మించి అదనంగా భవనాన్ని నిర్మిస్తే అనుమతులను విధిగా తీసుకోవాలని లేని పక్షంలో అక్రమ భవన నిర్మాణ జాబితాలో చేరుతుంది తద్వారా భవనానికి నోటీసులు అందజేసి కూల్చివేసే అవకాశం ఉంటుందని జిహెచ్ఎంసి అధికారులు హెచ్చరిస్తున్నారు... సో.. అక్రమ నిర్మాణదారులు తస్మాత్ జాగ్రత్త.



Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588